

తిరుమల లడ్డూ ప్రసాదంలో వైసీపీ ప్రభుత్వంలో జరిగిన నెయ్యి కల్తీ అక్రమాల నుంచి తప్పించుకోవడానికే హెరిటేజ్‌పై నిందలు వేస్తున్నారు. శ్రీవారి ప్రసాద పవిత్రతను దెబ్బతీయడానికి ఎవరికీ అధికారం లేదు. సిట్ ఏర్పాటు చేస్తే సరఫరా చేసినది నెయ్యి కాదని తేలింది. ఆ తప్పును బయటపెడుతుంటే ఇతరులపై నెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



గురువారం 26.02.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 310 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# జూన్ నాటికి 'వెలిగొండ'

- రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు బ్లూప్రింట్
- ఈ ఏడాది జూలైకి వెలిగొండ తొలిదశ పూర్తి చేసి నీళ్లు
- మార్కాపురం జిల్లాతో దశాబ్దాల కల సాకారం.. రూ.50 కోట్లతో కలక్టరేట్
- జిల్లా ఏర్పడ్డాక తొలిసారి వెళ్లిన ముఖ్యమంత్రికి అపూర్వ స్వాగతం
- గత పాలకులు ప్రాజెక్టు పూర్తి కాకుండానే జాతికి అంకితమిచ్చేశారు
- వెలిగొండపై వైసీపీ డ్రామాలను ఎండగట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- రూ.456 కోట్లతో వెలిగొండ ఫీడర్ కెనాల్ పనులకు సీఎం శంకుస్థాపన
- మార్కాపురం జిల్లా కళ, వెలిగొండ కళకళ బహిరంగ సభా వేదికలో సీఎం





**మార్కాపురం (జర్నలిస్ట్ ఫైల్) :** ఈ ఏడాది జూలై నాటికి వెలిగొండ తొలిదశ పూర్తిచేసి మార్కాపురం జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగు నీరందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గత పాలకుడిలా ప్రాజెక్టు పూర్తి కాకుండానే జాతికి అంకితమంటూ రిబ్బన్ కటింగ్లు చేసి దొంగ నాటకాలు ఆడటం తమకు చేతకాదని సీఎం వ్యాఖ్యానించారు. వెనుకబాటుకు గురైన మార్కాపురం ప్రాంతాన్ని కొత్త జిల్లాగా ఏర్పాటు చేస్తామన్న హామీని నిలబెట్టుకున్నామని సీఎం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతీ ఎకరాకూ నీరివ్వాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని వెల్లడించారు. దీనికోసం విశ్రాంత ఇంజనీర్లతో ఓ బృందాన్ని వేసి అధ్యయనం చేయిస్తామని తెలిపారు. ప్రతీ ఎకరాకూ సాగునీరు ఇచ్చే అంశంపై బ్లూ ప్రింట్ తయారు చేస్తామని అన్నారు. మార్కాపురం జిల్లా దోర్నాల మండలం గంటవాని పల్లెలో రూ.456కోట్లతో వెలుగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. రైతులతో కలిసి పనులను పరిశీలించారు. అనంతరం మార్కాపురంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ...'గత ఐదేళ్లలో రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి ప్రజలు 94 శాతం స్ట్రైక్ రేటు ఇచ్చారు. అరకు మొదలుకొని ప్రకాశం వరకూ మంచి విజయం అందించారు. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో మార్కాపురం, మదనపల్లి, పోలవరం ప్రాంతాలను జిల్లాలు చేస్తానని మాట ఇచ్చి ఇప్పుడు నిలబెట్టుకున్నాను. ఇక్కడి ప్రజలు 150 కిలోమీటర్లు ప్రయాణించి ఒంగోలు కు వెళ్లాల్సిన పని లేకుండా మార్కాపురాన్ని జిల్లా చేశాను. అన్యాయం జరిగిన మదనపల్లికి న్యాయం చేశా' అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**శంకుస్థాపనతో పాటు ప్రారంభించే అవకాశం నాకే వచ్చింది :** 1996,మార్చి 5న ఈ ప్రాంతంలో నేను పర్యటించినప్పుడు ప్రజల కష్టాలు కళ్ళారా చూశాను.

మిగతా 2లో...

## యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యం

- క్లస్టర్ బేస్డ్ విధానంలో పారిశ్రామికాభివృద్ధి, ఉద్యోగాల కల్పన!
- జాబ్ మేళాల ద్వారా ఇప్పటివరకు 1.08 లక్షల మందికి ఉద్యోగాలు
- ఇండస్ట్రీ టై అప్ తో స్కిల్ డెవలప్ మెంట్ కార్యక్రమాలకు చర్యలు
- సోలార్ సెల్ మ్యానుఫ్యాక్చరింగ్ పై న్యూ సౌత్ వేల్స్ వర్సిటీతో ఒప్పందం
- న్యాక్ బలోపేతం ద్వారా ప్రపంచస్థాయి భవన నిర్మాణ కార్మికులను తయారుచేస్తాం
- శాసనసభలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** సూపర్ -6లో ఇచ్చిన తొలి హామీ 5ఏళ్లలో 20లక్షల ఉద్యోగాల కల్పన. ఒకేరాష్ట్రం, ఒకేరాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ ప్రజాప్రభుత్వ లక్ష్యం. అందులో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్లస్టర్ బేస్డ్ విధానాన్ని తీసుకొని ముందుకు వెళ్తున్నాం. ఇప్పటికే సుమారు 22 క్లస్టర్లను గుర్తించామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. శాసనసభలో స్కిల్ డెవలప్ మెంట్ కార్యక్రమాలు ఏమేరకు ఆశించిన ఫలితాలు ఇస్తున్నాయి, శిక్షణా కేంద్రాల పనితీరు, ఉద్యోగావకాశాలు, ప్రతిపాదిత నూతన పారిశ్రామిక భాగస్వామ్య వివరాలపై ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ,, యార్లగడ్డ వెంకట్రావు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, వెంకటరాజు అడిగిన ప్రశ్నలకు మంత్రి లోకేష్ సమాధానమిస్తూ... రాయలసీమ, అనంతపురంల లో ఆటోమోటివ్ క్లస్టర్, కర్నూలులో రెన్యువబుల్ ఎనర్జీ, సిమెంట్ క్లస్టర్, కడప, చిత్తూరులో ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్, నెల్లూరులో గ్లాస్, ఏసీ క్లస్టర్ వస్తోంది. ప్రకాశం జిల్లాలో కంప్రెస్డ్ బయోగ్యాస్ క్లస్టర్, అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ క్లస్టర్, గోదావరి జిల్లాలో ఆక్వా క్లస్టర్, ఉత్తరాంధ్రలో ఫార్మా, మెడికల్ డివైసెస్ మ్యానుఫ్యాక్చరింగ్, స్టీల్ క్లస్టర్ వస్తున్నాయి. డ్రోన్ సిటీ, స్పేస్ సిటీ కూడా వస్తున్నాయి. ఆయా క్లస్టర్లలో వర్టికల్, హారిజంటల్ ఇంటిగ్రేషన్ చాలా అవసరం. కేవలం బేసిక్ మ్యానుఫ్యాక్చరింగ్ మాత్రమే కాకుండా అనుబంధ తయారీ యూనిట్లు కూడా అదే క్లస్టర్ లోకి తీసుకురావాలన్నది ప్రభుత్వ లక్ష్యం. యాపిల్ మొబైల్ సంస్థ డిజైనింగ్, మార్కెటింగ్ చేస్తుంది. మ్యాను ఫ్యాక్చరింగ్ ఫాక్స్ కాన్ చేస్తుంది. అయితే అన్ని కాంపొనెంట్ లను ఫాక్స్ కాన్ తయారు చేయదు. 2వేలమంది సప్లయర్స్ దగ్గర నుంచి ఫాక్స్ కాన్ కాంపొనెంట్స్ కొనుగోలు చేస్తుంది. వారందరినీ ఒక ఎకోసిస్టమ్ లోకి తీసుకురావాలన్నది మా ఆలోచన. మరొకటి గ్లాస్ మ్యానుఫ్యాక్చరింగ్.

మిగతా 2లో...

## ఉగ్రవాదానికి భారత్ వ్యతిరేకం

- ఇజ్రాయెల్ పార్లమెంటులో ప్రధాని మోదీ

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఉగ్రవాదానికి తాము పూర్తి వ్యతిరేకమని, భారత్ అనేక దశాబ్దాలుగా ఈ సమస్యతో ఇబ్బంది పడుతోందని ప్రధాని మోదీ (గ్రావీ వీశీఱ) పేర్కొన్నారు. ఇజ్రాయెల్ పార్లమెంటులో ప్రసంగించిన ఆయన.. ఉగ్రవాదంపై పోరులో ఆ దేశానికి పూర్తిగా అండగా ఉంటామన్నారు. ఇక్కడ ప్రసంగించిన తొలి భారత ప్రధానిని తానేనని, దీనిని గొప్ప గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు.



రెండోసారి ఇక్కడికి రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. భారత్, ఇజ్రాయెల్‌లు ప్రాచీన నాగరికత కలిగిన దేశాలని గుర్తుచేశారు. "ఉగ్రవాదాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సమర్థించలేం. హమాస్ దాడి చేసి పౌరులను చంపడం దారుణం. శాంతిస్థాపన అనేది సులువైన విషయం కాదు. ఇజ్రాయెల్‌కు అనేక అంశాల్లో భారత్ అండగా నిలుస్తుంది. హమాస్ దాడుల తర్వాత మీ బాధలను మేం పంచుకున్నాం. ఉనికి కోసం యూదులు అనేక కష్టాలు పడ్డారు. పాలస్తీనా సమస్యలపై స్పందించాల్సిన సమయం వచ్చింది. ఉగ్రవాదం విషయంలో ద్వంద్వ వైఖరి విడనాడాలి.

మిగతా 2లో...

## చేనేతకు 'అసెంబ్లీ' ఆదరణ



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** చేనేత వస్త్రాల అమ్మకాల పెంపుదలకు కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు విజయవంతమవుతున్నాయి. ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేసిన చేనేత స్టాళ్లకు విశేష స్పందన లభిస్తోంది. స్పీకర్ అయ్యన్న పాత్రుడు సహా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ విప్ లు చేనేత వస్త్రాల కొనుగోలుకు ముందుకొస్తున్నారు. రోజూ ఆ స్టాళ్లను సందర్శిస్తూ చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. ఈ నెల 20తేదీన చేనేత స్టాళ్లను అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రారంభించారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలకు చెందిన ప్రఖ్యాతగాంచిన చేనేత ఉత్పత్తులను ఆ స్టాళ్లలో అమ్మకానికి పెట్టారు.

మిగతా 2లో...

## ఏపీ పర్యాటక రంగానికి మహర్దశ



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తూ భారీస్థాయిలో ఉపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. బుధవారం శాసన మండలిలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు అడిగిన ప్రశ్నలకు మంత్రి కందుల దుర్గేష్ సుదీర్ఘమైన, స్పష్టమైన సమాధానం ఇచ్చారు.

**ఉపాధి మరియు పెట్టుబడుల వెల్లువ:** ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్ఐపీబీ) ఆమోదించిన వివిధ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో 39,264 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనుందని వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యాటక రంగానికి 'పారిశ్రామిక హోదా' కల్పించడం వల్ల గత 18 నెలల్లోనే రూ. 20,088 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని,

మిగతా 3లో...

## మరిన్ని కథనాలు లోపలి పేజీల్లో

### రాష్ట్రంలో 1000కు పైగా ఆధునిక గోడౌన్లు



- రైతు నిల్వ సామర్థ్యాల్లో చారిత్రాత్మక ముందడుగు..
- రూ.504 కోట్ల భారీ పెట్టుబడి
- గ్రామీణ వ్యవసాయ రంగానికి నూతన శకం
- తక్కువ వడ్డీ రుణాలు...
- పూర్తి ప్రభుత్వ హామీతో రైతు సంఘాలకు భరోసా
- శాసనమండలిలో సభ్యుల ప్రశ్నలకు సమాధానం తెలిపిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

### దేశానికే వ్యూహాత్మక ఖనిజాల నిలయంగా ఏపీ



- రేర్ ఎర్త్ ఎలిమెంట్ కారిడార్‌గా ఏపీ నిలవబోతోంది
- మైనింగ్ మాత్రమే కాకుండా వాల్యూ యాడెడ్ చైన్ అభివృద్ధి చేయాలి
- బీచ్ శాండ్ మినరల్స్ రంగంలో దేశాన్ని అగ్రస్థానంలో నిలుపుదాం
- రేర్ ఎర్త్ మినరల్స్ వర్క్ షాపులో మంత్రి మంత్రి కొల్లు రవీంద్ర

### శ్రీకాకుళంలో డయేరియా కలకలం... మున్సిపల్ కమిషనర్ సస్పెన్షన్



- బాధిత కుటుంబానికి రూ.10 లక్షల సాయం
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** శ్రీకాకుళం నగరంలో డయేరియా వ్యాధి విజృంభించడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది.

మిగతా 2లో...

## విస్తృత స్థాయిలో కిడ్నీ రోగులకు ఉచిత డయాలసిస్ సేవలు

- గడిచిన 20 నెలల్లో 14 కేంద్రాల ప్రారంభం
- త్వరలో వినియోగంలోనికి రానున్న మరో 11 నూతన కేంద్రాలు
- శాసన మండలిలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** పేద కిడ్నీ రోగుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం ఉచిత డయాలసిస్ సేవలను విస్తృతం చేస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. శాసనమండలిలో బుధవారం సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సత్యకుమార్ సమాధానమిస్తూ 76 ప్రభుత్వాసుపత్రులు, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ఆధ్వర్యంలోని 176 అనుబంధ ఆసుపత్రుల్లో కలిపి 2,721 యంత్రాల ద్వారా 21,504 మంది రోగులు ఉచితంగా డయాలసిస్ సేవలు పొందుతున్నారని తెలిపారు. గడిచిన 20 నెలల్లో సెకండరీ ఆసుపత్రుల్లో కొత్తగా 14 డయాలసిస్ కేంద్రాలను కూటమి ప్రభుత్వం ప్రారంభించిందని పేర్కొన్నారు. అంతేకాకుండా కిడ్నీ రోగులకు మరింత సౌకర్యంగా ఉండేందుకు సెకండరీ ఆసుపత్రుల్లోనే కొత్తగా మరో 11 ఉచిత డయాలసిస్ కేంద్రాలను అందుబాటులోనికి తీసుకురాబోతున్నామని వెల్లడించారు.

**పెరిగిన సేవలు :** గత ప్రభుత్వ హయాంలో 47 సెకండరీ ఆసుపత్రుల్లో 555 యంత్రాలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం రోగుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని వీటి సంఖ్యను అదనంగా 161కు పెంచిందని తెలిపారు.

మిగతా 2లో...

## విభిన్న ప్రతిభావంతులకు ఉచిత ప్రయాణం



- రవాణా శాఖలో ఆటోమేషన్
- అసెంబ్లీలో బడ్జెట్ డిమాండ్‌పై చర్చలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** విభిన్న ప్రతిభావంతులకు కూడా ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా స్త్రీ శక్తి పథకం ద్వారా నేటి వరకు 47 కోట్ల ప్రయాణాలు జరగగా, రూ. 1660 కోట్ల సబ్సిడీ ప్రభుత్వం భరించిందని తెలిపారు. అసెంబ్లీలో బడ్జెట్ డిమాండ్‌పై చర్చలో ఆయన మాట్లాడుతూ.. ఈ పథకం అమలుతో మహిళా ప్రయాణికుల శాతం 40% నుంచి 65%కు పెరిగిందని, రోజుకు సగటున 25 లక్షల మంది మహిళలు ప్రయాణిస్తున్నారని వెల్లడించారు.

మిగతా 2లో...

## ఈ ఏడాదే భోగాపురం విమానాశ్రయ వాణిజ్య సేవలు

- పోర్టులు, ఫిషింగ్ హార్బర్ నిర్మాణాలను సకాలంలో పూర్తి చేస్తాం
- శాసమండలిలో మంత్రి జనార్ధన్ రెడ్డి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అల్లూరి సీతారామరాజు (భోగాపురం) అంతర్జాతీయ విమానాశ్రయం అభివృద్ధి పనులు 95 శాతం పూర్తయ్యాయని మౌలిక సదుపాయాలశాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డి తెలిపారు. బుధవారం శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో భోగాపురం ఎయిర్‌పోర్టుపై సభ్యులు పివివి సూర్యనారాయణ రాజు, వరుదు కళ్యాణి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. 2026 మధ్య నాటికి పూర్తి స్థాయి వాణిజ్య సేవలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈ ఎయిర్ పోర్టు శంకుస్థాపనకు ముందే అవసరమైన అనుమతులు తీసుకున్నామన్నారు. తుమాటి మాధవరావు, వరుదు కళ్యాణి, మొండితోక అరుణకుమార్ అడిగిన మరో ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ.. రాష్ట్రంలోని పోర్టుల ప్రయివేటీకరణ అంశంపై

మిగతా 2లో...

## ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు షాక్..



- 10వేల కంటే ఎక్కువ జీతం ఉంటే పథకాలకు అనర్హులే

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఏపీ ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలపై నేడు ఏపీ అసెంబ్లీలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ.. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలు వర్తించవని అన్నారు.

మిగతా 2లో...

# అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో భాగంగా బుధవారం నిర్వహించిన ప్రశ్నోత్తరాల సమయంలో వారి అర్హతకు తక్కువైన, తక్కువ వేతనం పొందుతున్న అవుట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు.

లిఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం పట్ల ప్రజల్లో ఉన్న మమకారం నేటిది కాదని, తక్కువ జీతమైనా, అర్హతకు తగకయినా, ప్రభుత్వ ఉద్యోగం అయితే చాలు అనే భావన ఎక్కువగా ఉందని, ఇందుకు ప్రధాన కారణం ప్రభుత్వ ఉద్యోగం కల్పించే భద్రత అని చెప్పారు.

అయితే, తక్కువ జీతంతో ప్రభుత్వంలోనే పని చేస్తున్న అవుట్సోర్సింగ్ ఉద్యోగుల పరిస్థితి మాత్రం అత్యంత దయనీయంగా ఉందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల నలుగురు పిల్లలతో తనను కలిసిన ఓ మహిళ పరిస్థితిని ఉదాహరణగా ప్రస్తావించారు. ఆ కుటుంబంలో ఒక బాలుడు బ్రెయిన్ సమస్యతో బెడ్ రిడన్‌గా(మంచానికి పరిమితమయి) ఉండగా, అతనికి పెన్షన్ అందడం లేదని తెలిపారు.

ఆ కుటుంబానికి చెందిన వ్యక్తి పోలీస్ శాఖలో అవుట్సోర్సింగ్ విభాగంలో స్వీపర్‌గా పనిచేస్తూ నెలకు కేవలం 12,000 మాత్రమే జీతం పొందుతున్నారని పేర్కొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగిగా "సిక్స్ స్టెప్ వెరిఫికేషన్"లో నమోదు కావడం వల్ల, వారికి తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలు అందడం లేదని వివరించారు. అలాగే బెడ్ రిడన్ బాలుడికి పెన్షన్ కూడా రాకపోవడం బాధాకరమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు.

గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోనే సుమారు 2000 మంది అవుట్సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారని, రాష్ట్రవ్యాప్తంగా ఈ సంఖ్య లక్షకు చేరువలో ఉందని తెలిపారు. గవర్నమెంట్ ట్రెజరీ ద్వారా జీతభత్యాలు పొందుతున్నారనే ఒకే కారణంతో వారికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందకపోవడం అన్యాయమని అభిప్రాయపడ్డారు.

అవుట్సోర్సింగ్ కేటగిరీ-3 వంటి తక్కువ జీతాలు పొందుతున్న ఉద్యోగులకు తల్లికి వందనం, ఇళ్ల పథకాలు (టిట్కో ఇళ్లు), పెన్షన్లు వంటి సంక్షేమ పథకాలు అందేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని మంత్రి గారిని కోరుతున్నట్లు తెలిపారు.

తక్కువ వేతనాలతో కుటుంబాలను పోషిస్తున్న అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి విజ్ఞప్తి చేశారు.

# పాల విక్రయ, నిల్వ కేంద్రాల్లో తనిఖీలు




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** రాజమహేంద్రవరంలో కల్తీ పాల ఘటన నేపథ్యంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం నుంచి పాల విక్రయ కేంద్రాల్లో తనిఖీలకు శ్రీకారం చుట్టింది. వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలు అనుసరించి ఫుడ్ సేఫ్టీ అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా పాల విక్రయ కేంద్రాల నుంచి సుమారు 150 నమూనాలు సేకరించి, వాటిని పరీక్ష నిమిత్తం హైదరాబాదు, చెన్నై, కాకినాడలోని గుర్తింపు పొందిన ల్యాబ్స్ కు పంపించారు. అనంతపురం పట్టణంలో రెండు వేర్వేరుచోట్ల కలిపి సుమారు వంద లీటర్ల పాలలో నాణ్యత లోపించినట్లు గుర్తించి పారబోశారు. ఒక కేంద్రంలోని ఫ్రిజ్లో 30 లీటర్ల పాలు పాడైపోయినట్లు గుర్తించారు. అలాగే మరోచోట 70 లీటర్ల పాలలో నాణ్యత లోపించినట్లు అక్కడికక్కడే ప్రత్యేక కిట్ ద్వారా తేలడంతో వాటిని పారబోశారు. మచిలీపట్టణంలో మరో 20 లీటర్ల బాదంపాలులోనూ నాణ్యత లోపించినట్లు అధికారులు గుర్తించారు.

కాకినాడలో నాణ్యతలేని ఐదు కేజీల మిల్క్ పౌడర్ సీజ్ చేశారు. పాల విక్రయాల్లో అవకతవకలకు పాల్పడిన, తప్పుడు విధానాలు అనుసరించిన వారిపై నిబంధనలను అనుసరించి చర్యలు తీసుకుంటామని ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ డైరెక్టర్ నీలకంఠారెడ్డి చెప్పారు.

ఈ విషయమై బుధవారం రాత్రి విడుదల చేసిన ప్రకటనలో తనిఖీలను మరో వారం వరకు కొనసాగిస్తామని చెప్పారు. రూ. 8వేల వరకు ఖరీదు చేసే మ్యాజిక్ కిట్ల ఆధారంగా పాల నాణ్యతను గుర్తిస్తున్నామని చెప్పారు.

పాలలో యూరియా, పిండి పదార్థం, వెజిటేబుల్ ఆయిల్ వంటివి ఏది కలిపిన మ్యాజిక్, కిట్స్లో ఉండే లాక్టో మీటర్ వంటి పరికరాల ద్వారా తెలిసిపోతుందని చెప్పారు.

వీటిని రాష్ట్రంలోని 28 జిల్లాలకు పంపించామని తెలిపారు. ప్రధానంగా పాలు క్యాన్ల ద్వారా, లూజుగా పాలను విక్రయించే కేంద్రాల్లో ఈ తనిఖీలు జరుగుతున్నాయి.

# ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు పథకాలు వర్తించేలా అసెంబ్లీలో ప్రకటన చేయాలి

- **ఔట్సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల బుజ్జి డిమాండ్**



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** అసెంబ్లీ సమావేశాల్లో ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై పలువురు శాసనసభ్యులు ప్రస్తావించడం సంతోషకరమని ఆంధ్రప్రదేశ్ వైద్య మిత్ర దళిత గిరిజన కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల బుజ్జి పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఔట్సోర్సింగ్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు సి.ఎఫ్.ఎం.ఎస్ ఐడీలు ఉండటం వల్ల సచివాలయాల్లో ఆధార్ నమోదు సమయంలో ప్రభుత్వ ఉద్యోగులుగా చూపిస్తున్నారని, ఈ కారణంగా రాష్ట్రంలోని లక్షలాది ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పలు సంక్షేమ పథకాల నుంచి వంచితులవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సి.ఎఫ్.ఎం.ఎస్ ఐడీలు తొలగించి, అర్హులైన ఉద్యోగులకు పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న స్టాఫ్ నర్స్‌కు రూ. 38 వేల వరకు, టెక్నీషియన్‌కు రూ. 32 వేల వరకు వేతనం అందుతున్నప్పటికీ, వారికి ప్రభుత్వ పథకాలు వర్తిస్తున్నాయని తెలిపారు. కానీ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు మాత్రం పథకాలు అందకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్, పింఛన్లు, రేషన్ కార్డులు వంటి పథకాలు అందక అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. అందువల్ల ఎన్నికల హామీ మేరకు రాష్ట్రంలోని ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు వర్తించేలా ముఖ్యమంత్రి అసెంబ్లీలో స్పష్టమైన ప్రకటన చేయాలని మాచర్ల బుజ్జి డిమాండ్ చేశారు.

# ఏపీ పర్యాటక రంగానికి మహర్దశ



(మొదటి పేజీ తరువాయి)

ఇది ఒక విప్లవాత్మక మార్పు అని ఆయన అభివర్ణించారు. ఇందులో రూ. 9,445 కోట్లతో సుమారు 7,348 గదుల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. నూతన పర్యాటక పాలసీ 2024-29తో పర్యాటక రంగంలో వినూత్న మార్పులు, విప్లవాత్మక సంస్కరణలు తెచ్చామన్నారు. అంతర్జాతీయ వేదికలపై ఏపీ బ్రాండ్ ను పెంపొందించేకు కృషి చేశామన్నారు. తద్వారా పర్యాటక రంగంలో పెట్టుబడులు వెల్లువలా వచ్చాయని వివరించారు. ముఖ్యంగా సీఐఐ సమ్మిట్ లో పెద్దఎత్తున ఎంవోయూలు కుదర్చుకున్నామన్నారు.

**కేంద్ర ప్రభుత్వ సహకారం - నిధుల వివరాలు:** కేంద్ర ప్రభుత్వంలోని పిలిగ్రిమ్ రెజువనేషన్ అండ్ స్పిరుచ్యువల్ ఆగ్మెంటేషన్ డ్రైవ్( ప్రసాద్), స్వదేశీ దర్శన్ 2.0, ఛాలెంజ్ బేస్డ్ డెస్టినేషన్ డెవలప్ మెంట్ (సీబీడీడీ), స్పెషల్ అసిస్టెన్స్ టూ స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్ మెంట్స్ (శాస్కి) తదితర పథకాల కింద రాష్ట్రానికి రూ. 429.06 కోట్ల నిధులు మంజూరయ్యాయని మంత్రి దుర్గేష్ వివరించారు. శాస్కి ద్వారా అఖండ గోదావరికి రూ. 94.44 కోట్లు, గ్రాండ్ క్యానియన్ ఆఫ్ ఇండియా అయిన గండికోట అభివృద్ధికి రూ. 77.91 కోట్లు, స్వదేశీ దర్శన్ 2.0 ద్వారా సూర్యలంక బీచ్ అభివృద్ధికి రూ. 97.52 కోట్లు, అరకులోయ బొర్రా గుహల ఎక్స్ పీరియన్స్ సెంటర్ అభివృద్ధికి రూ. 29.88 కోట్లు, సీబీడీడీ ద్వారా అహోబిలం అభివృద్ధికి రూ. 25 కోట్లు, ప్రపంచ స్థాయి బౌద్ధ గమ్యస్థానంగా నాగార్జున సాగర్ బౌద్ధ వారసత్వ కేంద్రాల అభివృద్ధికి రూ. 25 కోట్లు, ప్రసాద్ ద్వారా అన్నవరం, సింహాచలం వరహాలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానాల్లో నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 54.04 కోట్లు మంజూరు అయ్యాయని, ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో శరవేగంగా పనులు జరుగుతున్నాయని వివరించారు.

**కొత్త ప్రతిపాదనలు - పర్యాటక సర్క్యూట్లు:** ఇప్పటికే కేంద్రానికి మరిన్ని ప్రతిపాదనలు పంపినట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. ప్రసాద్ పథకం క్రింద గుంటూరు జిల్లాలో మంగళగిరి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయ అభివృద్ధి, శ్రీకాకుళం జిల్లాలో శ్రీకాకుళం, అరసవెల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి దేవస్థానం అభివృద్ధి, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, శ్రీ గృహమల్లేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి గ్రామంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం అభివృద్ధి, తూర్పు గోదావరి జిల్లా కోరుకొండలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అభివృద్ధి చేయాలని ప్రతిపాదించామన్నారు. స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద కృష్ణా జిల్లా మచిలీపట్నం వద్ద మచిలీపట్నం బీచ్ ను వైబ్రాంట్ బీచ్ గా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించామని వివరించారు. ఇవి కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. ఈ విషయమై కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్ర సింగ్ ను కలిసి డీపీఆర్ లు అందించామన్నారు. అదే విధంగా రాష్ట్రంలో పర్యాటక సర్క్యూట్‌లను అభివృద్ధి చేస్తున్నామని చెబుతూ విశాఖ-అ-రకు, విశాఖ-సింహాచలం-అరసవిల్లి, రాజమహేంద్రవరం సర్క్యూట్, డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి ప్రత్యేక సర్క్యూట్, అమరావతి, తిరుపతి లలో వివిధ రకాల సర్క్యూట్ లు ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాల ప్రత్యేకతలను మరింత పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కోనసీమలో హోమ్ స్టే పాలసీ తీసుకొచ్చి హోమ్ స్టేలను పెంపొదిస్తున్నామన్నారు.

**పారదర్శకత - పెట్టుబడిదారులకు ఆహ్వానం:** పర్యాటక ప్రాజెక్టుల కోసం అందుబాటులో ఉన్న భూముల వివరాలను (సర్వే నంబర్లతో సహా) పర్యాటక శాఖ వెబ్‌సైట్‌లో బహిరంగంగా ఉంచామని మంత్రి దుర్గేష్ తెలిపారు. నిబంధనల ప్రకారం డీపీఆర్ లతో, బ్రాండింగ్ కంపెనీ తో వచ్చే ఇన్వెస్టర్లకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ఇవేవీ తెలుసుకోకుండా కొందరు సభ్యులు పర్యాటక శాఖపై నిందలు వేయడం తగదన్నారు. దరఖాస్తు చేసుకునే ఉద్దేశముంటే పార్టీలకతీతంగా సహకరించేందుకు తాము సిద్ధమన్నారు. ఈ సందర్భంగా అధికారుల స్పందనపై కొందరు శాసన మండలి సభ్యులు లేవనెత్తిన అంశాలపై స్పందిస్తూ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి దుర్గేష్ తో పాటు మంత్రి అచ్చెన్నాయుడు కూడా స్పష్టం చేశారు. శాసనమండలి సభ్యులు సత్యదూరమైన వ్యాఖ్యలు చేయడం సరికాదని పేర్కొన్నారు.

అటవీ, పర్యాటక, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ శాఖల మధ్య సమన్వయం కోసం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో సీఎం చంద్రబాబునాయుడు ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ నిరంతరం సమీక్షిస్తోందని, తద్వారా పర్యాటక రంగాన్ని సరికొత్త ఎత్తులకు తీసుకెళ్తామని మంత్రి కందుల దుర్గేష్ ధీమా వ్యక్తం చేశారు.

అనంతరం ఎమ్మెల్సీ సోమువీర్రాజు మాట్లాడుతూ పర్యాటక రంగంపై ప్రశ్న వేసింది తానని మంత్రి దుర్గేష్ స్పష్టమైన సమాధానమిచ్చారని ఈ సమయంలో ప్రతి సభ్యుడు కలగజేసుకోవడం సరికాదన్నారు.

# రాష్ట్రంలో 1000కు పైగా ఆధునిక గోడౌన్లు



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** శాసన మండలిలో వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధికింద ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలును బహుళార్థ సాధక సౌకర్య కేంద్రాలులుగా అభివృద్ధి చేసే కార్యక్రమంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి అచ్చెన్నాయుడు సమగ్రంగా సమాధానం ఇచ్చారు. జూన్ 2020లో కేంద్ర ప్రభుత్వ Agriculture Infrastructure Fund పథకం ద్వారా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని, రైతు భరోసా కేంద్రం స్థాయిలో నిల్వ మరియు ఆరబెట్టే మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. విశాఖపట్నం జిల్లా మినహా రాష్ట్రవ్యాప్తంగా గోడౌన్లు మరియు డ్రైయింగ్ యార్డుల నిర్మాణం జరుగుతోందని, మొత్తం రూ. 504.42 కోట్ల వ్యయంతో ఈ పథకం అమలవుతోందని పేర్కొన్నారు. నాబార్డ్ ద్వారా రీఫైనాన్స్ సదుపాయం కల్పించబడుతుందని, PACSలకు 4% వడ్డీపై 3% వడ్డీ రాయితీ లభిస్తుందని, 90% రుణం మరియు 10% మార్జిన్ మనీ విధానంలో ప్రాజెక్టులు అమలవుతున్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మార్జిన్ మనీ కింద రూ. 50.4 కోట్లు మంజూరు చేసి అందులో రూ. 20 కోట్లు ఇప్పటికే విడుదల చేసిందని, 33 సంవత్సరాల పాటు ఏడాదికి రూ. 1 నామమాత్రపు అద్దెకు ప్రభుత్వ భూమి లీజుకు ఇస్తున్నట్లు, రిజిస్ట్రేషన్ ఫీజు మరియు స్టాంపు డ్యూటీ మినహాయింపు కల్పించినట్లు చెప్పారు. ఈ పథకం కింద రుణాలకు ప్రభుత్వ హామీ ఉంటుందని స్పష్టం చేశారు. ఇప్పటివరకు 1005 MPFC గోడౌన్ల పనులు ప్రారంభమై, 717 గోడౌన్లు మరియు అనుబంధ డ్రైయింగ్ యార్డులు పూర్తయ్యాయని, 572 PACSలో 1111 సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి తేమ మీటర్లు, తూనిక బ్యాలెన్స్‌లు, డెస్క్‌టాప్‌లు సరఫరా చేసినట్లు తెలిపారు. 232 PACSలలోని 462 అసేయింగ్ కేంద్రాలకు అవసరమైన ల్యాబ్ పరికరాలు అందించామని చెప్పారు. మొత్తం రూ. 381.72 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని, అందులో గోడౌన్ల నిర్మాణానికి రూ. 373.97 కోట్లు, పరికరాల సరఫరాకు రూ. 7.75 కోట్లు ఖర్చయ్యాయని వెల్లడించారు. ఈ చర్యల ద్వారా రైతులకు శాస్త్రీయ నిల్వ సదుపాయాలు కల్పించి, పంటలకు మెరుగైన ధరలు సాధించే అవకాశాలు పెరుగుతున్నాయని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఈ పథకం కీలకంగా నిలుస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు మండలికి తెలియజేశారు.

**రైతు ఆదాయం పెంపే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం :** ఆకాల వర్షాల కారణంగా పంట చేతికి వచ్చే సమయంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం గుర్తించిందని, 2014--19 తెలుగుదేశం ప్రభుత్వ కాలంలో టార్పాలిన్లు పంపిణీ చేశామని, ఆ తరువాత పంపిణీ నిలిచిపోయిందని తెలిపారు. 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో టార్పాలిన్లు కొనుగోలు చేసి ప్రతి రైతు సేవా కేంద్రంలో బల్క్‌గా నిల్వ ఉంచామని, ఇంతకుముందు వ్యక్తిగతంగా పంపిణీ చేసేవారమని, ఇప్పుడు అవసరమైన రైతులు =ాఖల ద్వారా తీసుకుని అవసరం తీరిన తరువాత తిరిగి ఇచ్చే విధానాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. వ్యవసాయ రంగంలో సాంకేతికత విస్తృతంగా అభివృద్ధి చెందిందని, ఆధునిక ఎలక్ట్రానిక్ డ్రయర్లు మార్కెట్లో అందుబాటులో ఉన్నప్పటికీ అవి అధిక వ్యయంతో ఉన్నాయని తెలిపారు. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో చర్చించి రాష్ట్రంలోని ప్రతి ప్రాంతంలో ఒకటి లేదా రెండు చోట్ల నమూనా ప్రాతిపదికన ఎలక్ట్రానిక్ డ్రయర్లు ఏర్పాటు చేసి, ఫలితాలు అనుకూలంగా ఉంటే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. తడి ధాన్యాన్ని శాస్త్రీయంగా ఎండబెట్టి రైతులకు మెరుగైన ధర లభించేలా చేయడం ప్రభుత్వ లక్ష్యమని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆధునిక డ్రయింగ్ సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# విజయవాడలో మార్చి 7న రాష్ట్ర స్థాయి మహిళా దినోత్సవ వేడుకలు



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీ జేఏసీ అమరావతి స్టేట్ ఉమెన్ కమిటీ ఆధ్వర్యంలో మార్చి 7వ తేదీ శనివారం విజయవాడ సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రాష్ట్ర స్థాయి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర నాయకులు తెలిపారు. విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లోని ప్రధాన శాఖాధిపతి కార్యాలయాలు మరియు విజయవాడలోని అన్ని జిల్లా స్థాయి కార్యాలయాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

విజయవాడ లెనిన్ సెంటర్‌లోని రెవిన్యూ భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో మహిళా దినోత్సవ వేడుకలను జయప్రదం చేయడానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర చైర్‌పర్సన్ పారే లక్ష్మీ, స్టేట్ సెక్రటరీ జనరల్ పొన్నూరు విజయలక్ష్మి, రాష్ట్ర కోశాధికారి డా. వి.ఎస్. సాయిలక్ష్మి ఆధ్వర్యంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.

మహిళా విభాగం చైర్‌పర్సన్ పారే లక్ష్మీ మాట్లాడుతూ మహిళా దినోత్సవం కేవలం ఉత్సవం మాత్రమే కాకుండా మహిళల హక్కులు, సమానత్వం, భద్రత, గౌరవం వంటి అంశాలపై సమాజంలో చైతన్యం కలిగించే ఉద్యమ దినమని పేర్కొన్నారు. మహిళలు విద్య, ఉపాధి, నాయకత్వ రంగాల్లో ముందుకు రావాలంటే ప్రభుత్వ విధానాలు బలపడాల్సిన అవసరం ఉందని, ఇందుకు మహిళల ఐక్యత ముఖ్యమని తెలిపారు.

ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మరియు సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదర్ రావు మాట్లాడుతూ మార్చి 7న జరిగే రాష్ట్ర స్థాయి వేడుకలకు, అలాగే మార్చి 4, 5 తేదీల్లో నిర్వహించనున్న ఆటాపాటల కార్యక్రమాలకు ప్రత్యేక అనుమతి మంజూరు చేసిన ముఖ్యమంత్రి మరియు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కృతజ్ఞతలు తెలిపారు.

సెక్రటరీ జనరల్ పొన్నూరు విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న వివక్ష, అన్యాయాలను నివారించేందుకు కుటుంబం నుంచి కార్యాలయాల వరకు సానుకూల వాతావరణం ఏర్పడాలని అన్నారు. "మహిళల సాధికారతే సమాజ అభివృద్ధికి పునాది" అని పేర్కొంటూ, మార్చి 7న జరిగే కార్యక్రమంలో మహిళా ఉద్యోగినులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ నాయకులు పలిశెట్టి దామోదరరావు, తిమ్మసర్తి నాగేశ్వరరావు, రామిశెట్టి వెంకట రాజేష్, ఏ. అర్లయ్య, మందపాటి శంకరరావు, బత్తిన రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# దేశానికే వ్యూహాత్మక ఖనిజాల నిలయంగా ఏపీ



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ఉన్న సహజ వనరులను వెలికితీసి యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర గనులు భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. నోవాటెల్ హోటల్ లో ఏపీఎండీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీచ్ సాండ్ ఖనిజాల నుంచి టైటానియం, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ , శాశ్వత అయస్కాంతాలు - ఆంధ్రప్రదేశ్‌లో దేశీయ విలువ పెంపు గొలుసుల నిర్మాణం: అవకాశాలు అనే అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్ లో రాష్ట్ర గనులు, భూగర్భ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొని మాట్లాడుతూ.... రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి 'బీచ్ సాండ్ మినరల్స్' కీలకమని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతం దేశానికే వ్యూహాత్మక ఖనిజాల నిలయమనన్నారు.. రాష్ట్రాన్ని 'రేర్ ఎర్త్ ఎలిమెంట్ కారిడార్'గా అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం దృఢంగా ముందుకు సాగుతోందన్నారు. ఖనిజాల వెలికితీత నుండి తయారీ హబ్‌గా ఏపీ రూపాంతరం చెంది 'స్వర్ణాంధ్రప్రదేశ్' దిశగా అడుగులు వేస్తుందన్నారు.. శ్రీకాకుళం నుండి మచిలీపట్నం వరకు విస్తరించి ఉన్న విస్తారమైన తీరప్రాంతం ఖనిజ సంపదతో సమృద్ధిగా ఉందన్నారు. ముఖ్యంగా బీచ్ సాండ్ ఖనిజాలు కేవలం ఆదాయ వనరులు మాత్రమే కాకుండా క్లీన్ ఎనర్జీ, ఎలక్ట్రిక్ వెహికల్స్ , ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, రక్షణ రంగాలకు వ్యూహాత్మక వనరులుగా మారాయని పేర్కొన్నారు. తన నియోజకవర్గం మచిలీపట్నంలో కూడా ఈ ఖనిజ నిక్షేపాలు గణనీయంగా ఉన్నాయని వెల్లడించారు.

గతంలో గనుల రంగం ఎదుర్కొన్న సవాళ్లను అధిగమిస్తూ గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పారదర్శకతను పునరుద్ధరించి సామర్థ్యాన్ని పెంచేందుకు నిర్ణయాత్మక చర్యలు తీసుకున్నామని మంత్రి తెలిపారు. మైనింగ్‌ను కేవలం ఆదాయ వనరుగా కాకుండా రాష్ట్ర ఆర్థిక వృద్ధిని నడిపించే ఇంజన్‌గా ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఖనిజ బ్లాకుల వేలాలను వేగవంతం చేయడం, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పై దృష్టి పెట్టడం, సాంకేతికత ఆధారంగా పారదర్శకత పెంపు వంటి చర్యలు చేపట్టామన్నారు. ఇటీవలి ఫోర్బ్స్ నివేదిక ప్రకారం దేశపు పెట్టుబడులలో 25 శాతం ఆంధ్రప్రదేశ్‌కు రావడం రాష్ట్రంపై పెట్టుబడిదారుల నమ్మకానికి నిదర్శనమన్నారు. వాల్యూ చైన్ అభివృద్ధి, తయారీ హబ్‌గా ఏపీ కేవలం ఖనిజాల వెలికితీతకే పరిమితం కాకుండా, ప్రాసెసింగ్, తుది ఉత్పత్తుల తయారీ వరకు పూర్తి స్థాయి విలువ ఆధారిత వ్యవస్థను రాష్ట్రంలోనే ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సహజ వనరులను వినియోగించి పరిశ్రమలు నెలకొల్పడం ద్వారా యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ సాధన దిశగా మైనింగ్ రంగంలో విప్లవాత్మక సంస్కరణలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

రాష్ట్రంలో 16,600 హెక్టార్లలో విస్తరించి ఉన్న 16 రకాల ఖనిజ నిక్షేపాలను గుర్తించామని, కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రాన్ని 'రేర్ ఎర్త్ ఎలిమెంట్ కారిడార్' అభివృద్ధి కోసం గుర్తించడం గర్వకారణమన్నారు. రాష్ట్ర మైనింగ్, తయారీ రంగాలను బలోపేతం చేసి సంస్కరణలకు ప్రోత్సాహం అందిస్తున్న గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. బాధ్యతాయుతమైన మైనింగ్, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమల స్థాపన వంటి అంశాలను సమగ్రంగా కలుపుకుని పూర్తి స్థాయి పర్యావరణ వ్యవస్థను నిర్మించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం, పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు కలిసి పనిచేస్తే ఆంధ్రప్రదేశ్‌ను అంతర్జాతీయ స్థాయిలో మైనింగ్ హబ్‌గా నిలబెట్టగలమని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.

ప్రత్యేక అతిథిగా పాల్గొన్న మాజీ డీఆర్‌డీఓ చైర్మన్, ప్రభుత్వ సలహాదారు డా. జి. సతీష్ రెడ్డి మాట్లాడుతూ..లి ప్రపంచవ్యాప్తంగా టైటానియం, రేర్ ఎర్త్ మాగ్నెట్లకు భారీ డిమాండ్ పెరుగుతోందన్నారు. రక్షణ, అంతరిక్ష, క్షిపణి సాంకేతికత, అధునాతన ఇంజినీరింగ్ రంగాల్లో ఈ పదార్థాల ప్రాముఖ్యత రోజురోజుకూ పెరుగుతోందని వివరించారు. స్వదేశీ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడం ద్వారా దిగుమతులపై ఆధారపడకుండ దేశం ముందుకు సాగగలదన్నారు. రాష్ట్రంలో సమృద్ధిగా లభించే బీచ్ సాండ్ ఖనిజాలను సాంకేతిక పరిజ్ఞానంతో విలువ పెంచితే అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీపడే స్థాయికి చేరుకోవచ్చని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం, పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు కలిసి పనిచేస్తే ఆంధ్రప్రదేశ్ దేశానికి మార్గదర్శకంగా నిలుస్తుందని సతీష్ రెడ్డి అన్నారు.

ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి (గనులు) ముకేష్ కుమార్ మీనా మాట్లాడుతూ.. దీర్ఘకాలిక ఖనిజ సరఫరా భద్రతతో పాటు పరిశ్రమలకు అనుకూల విధాన వాతావరణాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. సింగిల్ విండో వ్యవస్థ ద్వారా వేగవంతమైన అనుమతులు, పారదర్శక విధానాలు అమలు చేస్తున్నామని తెలిపారు. బీచ్ సాండ్ ఖనిజాల వినియోగంలో పర్యావరణ పరిరక్షణకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. పెట్టుబడిదారులకు దీర్ఘకాలిక విధాన స్థిరత్వం, స్పష్టమైన మార్గదర్శకాలు అందుబాటులో ఉంటాయని ముఖేష్ కుమార్ మీనా భరోసా ఇచ్చారు.

ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ కార్యదర్శి యువరాజ్ మాట్లాడుతూ.. పెట్టుబడిదారులకు ఎంతో అవసరమైన మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక పార్కులు, పోర్ట్ కనెక్టివిటీ వంటి అంశాలు ఆంధ్ర ప్రదేశ్ కు ఉన్న బలాలని చెప్పారు. వేగవంతమైన నిర్ణయాలతో పరిశ్రమలు త్వరగా స్థాపన దశకు చేరుకునేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పరిశ్రమల వాతావరణాన్ని రాష్ట్రంలో ఏర్పరచేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. యువ పారిశ్రామికవేత్తలను ఈ రంగంలోకి ఆకర్షించేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు పరిశీలిస్తున్నామని వెల్లడించారు.

ఏపీఎండీసీ వైస్ చైర్మన్, ఎండీ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో గుర్తించిన బీచ్ సాండ్ ఖనిజ నిల్వలు పరిశ్రమలకు దీర్ఘకాలిక ముడి సరుకు భద్రతను అందిస్తాయని తెలిపారు. శాస్త్రీయ తవ్వకాలు, సమర్థవంతమైన ఖనిజ ఉత్పత్తులను వేరు చేసే యూనిట్లు, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ముడి ఖనిజాల నుంచి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ వరకు ఏపీఎండీసీ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. పరిశ్రమలతో భాగస్వామ్యాల ద్వారా ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ స్థాయి శాస్త్రవేత్తలు, ఎమ్ఎస్ఎమ్ఈ పారిశ్రామికవేత్తలు, వివిధ కంపెనీల ప్రతినిధులు, తదితరలు పాల్గొన్నారు.

# దేవాలయాల పవిత్రత, పారదర్శక నిర్వహణకు ప్రాధాన్యం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ శాసనసభలో జరుగుతున్న బడ్జెట్ సమావేశాల్లో దేవాదాయ శాఖపై జరిగిన చర్చలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి కీలక ప్రసంగం చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ, భారతదేశ గొప్పతనం మరియు బలం మన దేశపు విలువలు, నమ్మకాలు, ఆచార వ్యవహారాల సమాహారమని, ఆ నమ్మకాలకూ, విలువలకూ నిలయాలుగా దేవాలయాలు నిలుస్తాయని అన్నారు. ప్రాచీన కాలం నుండి దేవాలయాలు విజ్ఞాన కేంద్రాలుగా, ఆధ్యాత్మిక తత్వజ్ఞాన ప్రయోగశాలలుగా వెలుగొందుతున్నాయని గుర్తుచేశారు.

అయితే గత పాలకుల హయాంలో దేవాలయాల పవిత్రత దెబ్బతిన్న సందర్భాలు చూశామని గళ్ళా మాధవి ఆవేదన వ్యక్తం చేశారు. ఆలయాభరణాలను నగల దుకాణాల ఆభరణాలుగా చూసే స్థాయికి దిగజార్చడం, ప్రసాదాల విషయంలో కల్తీలు, అక్రమాలు జరగడం వంటి ఘటనలు అత్యంత హేయమని మండిపడ్డారు. దేవాలయాల పవిత్రత, స్వచ్ఛతకు భంగం కలిగించే చర్యలు సమాజానికి అనర్థమని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత దేవాలయాల ప్రక్షాళనకు ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఆలయాల నిర్వహణ కోసం ఈ ఏడాది రూ. 249 వేల కోట్లు కేటాయించడం సంతోషకరమని పేర్కొన్నారు. దేవాలయాల పవిత్రతతో పాటు పరిసర ప్రాంతాల స్వచ్ఛతను కాపాడటం మన అందరి బాధ్యత అని అన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా పలు సూచనలు చేశారు:

రాష్ట్రంలోని ప్రాచుర్యం పొందిన ప్రతి దేవాలయాన్ని నో ప్లాస్టిక్ జోన్ గా ప్రకటించాలి.

పర్యావరణ హితమైన వస్తువులనే ఆలయాల్లో వినియోగించాలి.

దేవాలయ పరిసరాల్లో ప్లాస్టిక్ రహిత వాతావరణాన్ని ఏర్పాటు చేయాలి.

కోనేరుల (దేవాలయ పుష్కరిణులు) ప్రక్షాళనపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.

అదేవిధంగా దేవునిపై విశ్వాసంతో తమ జీవితాన్ని అంకితం చేసే పూజారులకు దేవాలయ ప్రాంగణంలోనే నివాస సదుపాయం కల్పించాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి సూచించారు. దీంతో పూజారులపై అద్దె భారం తగ్గడమే కాకుండా, ఆలయ శోభ మరింత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు.

# సీసీ షరాఫ్ మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్లో...

## రూ.95 వేలకే మోకాలి కీలు మార్పిడి శస్త్ర చికిత్స

## ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని




(జర్నలిస్ట్ ఫైల్) ప్రతినిధి హైదరాబాద్, ఫిబ్రవరి 25 : పేద రోగులకు మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా కాచిగూడలోని సీసీ షరాఫ్ మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్ నిరంతరం కృషి చేస్తోందని ట్రస్టీ ఎన్.సుకుమార్, జనరల్ మేనేజ ర్లు ఏ. సోమారెడ్డి, కే.శేషాద్రి, పి. ఎస్.ఎన్.మూర్తి తెలిపారు. మంగ ళవారం కాచిగూడలోని హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్స్ డాక్టర్ శశిధరన్, డాక్టర్ జి. ప్రతాప్ రెడ్డి, డాక్టర్ గోవింద్ గాంధీ లతో కలిసి వారు మాట్లాడారు. హాస్పిటల్లో మోకాలి కీలు మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకునే పేద రోగులకు నందిని రమేష్ గాంధీ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.50 వేలు సబ్సిడీగా అందిస్తున్నట్లు వా రు తెలిపారు. ఇతర కార్పొరేట్ ఆసుపత్రుల్లో రూ.2లక్షల వరకు అయ్యే ఖర్చును సీసీ షరాఫ్ మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్లో మోకాలి కీలు మార్పిడి శస్త్ర చికిత్సకు రూ.1,45,000 వరకు ఖర్చు



అవుతుందని, అందులో ట్రస్ట్ ద్వారా రూ.50వేలు చెల్లిస్తుండటంతో ప్రత్యేక ప్యాకేజీతో రూ. 95 వేలకే మోకాలికీలు మార్పిడి శస్త్ర చికిత్స పూర్తవుతుందని తెలిపారు. ఈ శస్త్ర చికిత్స ఆరోగ్యశ్రీ పథకంలో వర్తించదని స్పష్టం చేశారు. అదేవిధంగా అన్ని ఇన్సూరెన్స్ కంపెనీల్లో ఆరోగ్య బీమా సదుపాయం ఉన్న వారు, సి.జి.హెచ్.ఎస్ ఉద్యోగులు ఈ సదుపా యాన్ని వినియోగించుకోగలరని తెలిపా రు. అమెరికా టెక్నాల జీతో చేయబడిన ఇంప్లాంట్ ఉపయోగిస్తూ అనుభవజ్ఞు లైన ఆర్థోపె డిక్ వైద్యులచే శస్త్ర చికిత్సలు చే యడం జరుగుతుందన్నారు. చికి త్సా విధానంలో ఏలాంటి మార్పు ఉండదని, అన్ని కార్పొరేట్ ఆసు పత్రుల్లో అందుతున్న మాదిరిగానే ఇక్కడ వైద్య సేవలు అందుతాయ ని వారు పేర్కొన్నారు. శస్త్ర చికిత్స అనంతరం రెండో రోజు నడిపించ డం జరుగుతుందని, మూడో రోజు డిస్ ఛార్జ్ చేస్తామని తెలిపారు. రెండు వారాల తరువాత పనులను యదావిధిగా చేసుకునే అవకాశం ఉంటుందని వారు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు వాట్సాప్ నెంబర్: 799 5273377 ద్వారా సంప్రదించ వచ్చునని వారు సూచించారు.

# భారత్ విభిన్న సంస్కృతుల నిలయం

## – ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ




ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : మై భారత్ -- ఖమ్మం, యువజన వ్యవహారాలు అండ్ క్రీడల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల యువజన మార్పిడి కార్యక్రమం హోటల్ సూర్య తేజ ప్రైమ్ బ్యాంకెట్ హాల్ లో ఘనంగా ప్రారంభమైంది. హైదరాబాద్ నుండి 40 మంది యువతీ యువకులు ఖమ్మం జిల్లా సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకోవడం, చారిత్రక ప్రదేశాలను సందర్శించి వాటి ప్రాముఖ్యతను గురించి అవగాహన చేసుకోవడం, వారి సంస్కృతి సాంప్రదాయాలను స్థానిక యువతకు



తెలియపరచడం, జాతీయ సమైక్యత ను పెంపొందించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమం 24 ఫిబ్రవరి నుంచి 28 ఫిబ్రవరి వరకు నిర్వహించబడనుంది. ఈ ప్రారంభ కార్యక్రమానికి మై భారత్ -- ఖమ్మం ఉప సంచాలకులు చింతల అన్వేష్ అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ యువతను ఉద్దేశించి మాట్లాడుతూ భారతదేశ యువత జాతీయ నిర్మాణ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని, స్వామి వివేకానందుల ఆదర్శాలను అనుసరించాలని పిలుపునిచ్చారు. ప్రతి భారత యువకుడు ఇతర మతాలు, సంస్కృతులను గౌరవిస్తూ, ఎలాంటి ద్వేష భావాలు లేకుండా ఐక్యతతో జీవించాలని సూచించారు. ఇటువంటి అంతర్రాష్ట్ర యువజన మార్పిడి కార్యక్రమాలు యువతలో సోదరభావాన్ని పెంపొందించి, జీవితాంతం ఆనందంగా జీవించే శక్తిని ఇస్తాయని అన్నారు. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన డిస్ట్రిక్ ఫారెస్ట్ ఆఫీసర్ సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ దేశ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని, ఎలాంటి ఆశలు లేకుండా సమాజానికి సేవ చేసే గుణం యువతలో పెరగాలని అన్నారు. విద్యాభ్యాస దశలోనే యువతను గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రభుత్వం విస్తృతంగా భాగస్వాములను చేయాలని సూచించారు. గ్రామాల సమస్యలు ఏమిటి, వాటిని ఎలా పరిష్కరించాలి అనే అవగాహన యువతకు రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేరా యువ భారత్ అకౌంట్స్ అధికారి కమర్తపు భాను చందర్, యువజన సంఘాల అధ్యక్షులు కోడిరెక్క ఉమా శంకర్, సయ్యద్ షారుక్ ఇమ్రాన్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు. ఈ అంతర్ జిల్లా యువజన మార్పిడి కార్యక్రమం యువతలో జాతీయ ఐక్యత, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని నిర్వాహకులు తెలిపారు.

## వికారాబాద్ జిల్లాలో మెజారిటీ బిసి ఓట్లే కానీ

# అన్యాయం జరిగింది బీసీ వర్గానికే

రాజశేఖర్ అవుటి న్యాయవాది, మాజీ డీసీసీ ప్రతినిధి వికారాబాద్ జిల్లా.



(జర్నలిస్ట్ ఫైల్) వికారాబాద్ ఫిబ్రవరి 25 : ముఖ్యముగా బీసీ లను రాజకీయముగా వికారాబాద్ జిల్లాలో చుస్తే... మెజారిటీ బిసిల ఓట్లను కేవలము పల్లకీలు మోసే బోయిలుగా భావిస్తు , తాము గద్దెనెక్కడానికీ మెట్లుగా వాడుకుంటూ దాదాపు 56% శతము ఉన్న బీసీ లకు తీవ్ర అన్యాయము చేయడము అత్యంత దుర్మార్గము ప్రతిపక్షంలో ఉన్నా ,అధికారంలో ఉన్నా ,జనం కోసమే పనిచేసిన నాకు ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు ...కనీసం చేస్తున్న న్యాయవాద వృత్తిలో ఉన్న నామినేషన్ పోస్టులు కూడా ఇప్పించకుండా నమ్ముకున్న అధినాయకుడుతాను మాత్రమే గద్దెమీద ఉరేగాలి తన రక్తబంధువులు. మాత్రమే అధికార గద్దెమీద ఉండాలి అనే రీతిలోసంకుచితమనస్తత్వముతో ఆలోచిస్తూతమని కుర్చీ మీద కూర్చోబెట్టిన నాయకులను కనీసము పట్టించుకోకుండా అత్యంత స్వార్థముతో అధికారము వెలగబెడుతు తనని నమ్ముకున్న వారికి అత్యంత నిర్లక్ష్యముతో అన్యాయము చేస్తు నామినేటెడ్ పోస్టలలో అవకాశకల్పించకుండా గాలికి వదిలేసిన తీరు తీవ్ర గర్హనీయము తమని కుర్చిలో కూర్చోబెట్టిన వారికిభవిష్యత్తులో ఏం చెయ్యాలో బాగా తెలుసు అన్నవిషయముఅధినాయకుడు. మరచి ప్రవర్తించడము ఆతని మూర్ఖత్వానికి నిదర్శనము. నాలుగు పదుల మైలురాళ్ళను ఆడుతూ పాడుతూదాటలేదు నేను.ఊహ తెలిసిన నాటి నుంచి ప్రతి క్షణం పోరాటంతోనే సాగింది.ఎందుకంటే నేను గోల్డెన్ స్పూన్ తో పుట్టలేదు. తాత ముత్తాతల ఆస్తి పాస్తులు వారసత్వంగా పొందలేదు ప్రతిదినం వేదన, అవహేళన అవమానాలను దిగమింగుకుని పేదరికం స్థాయినుంచి మధ్యతరగతి స్థాయికి ఎగబాకాను. ఎవడిని ముంచకుండా ఎవడి మీద ఆధారపడకుండా ధీమాగాఎదిగాను. ఎన్ని మలుపులు చూడలేదు ఎన్ని కుట్రలు అనుభవించలేదు అన్నీ జరిగాయి. మనుషుల్ని చూసాను మనుషుల మనసుల్ని చూసాను మనసుల మతలబులూ చదివాను. అన్నీ తట్టుకుని శిఖరమై నిలిచాను. నన్నెవరూ ఏమీ చేయలేకపోయారు. నా వైభవశిఖరాన్ని నేనే కుప్పకూల్చు కుంటే ...కూల్చుకోవాలి ....!? ఇప్పుడు కూడా అంతే గాని నన్ను తొక్కేవాళ్ళు , నన్ను నాశనం చేసేవాళ్ళు పుట్టలేదు. ఏం చేసుకోవాలన్నా నన్ను నేనే... ఇంతకన్నా ఏం జరుగుతుంది....యేది.... జరిగితే ఆది జరగనీ.... నేను నాలాంటి , ఎంతమంది నిజమైనా నాయకులము జనం మేలు కోసము ప్రశ్నిస్తూ , పోరాటాలు చేస్తు , ఇన్ని తట్టుకున్నాము ఈ జీవితంలో ద్రోహులు, అసమర్థులు , మోసగాళ్ళు చేస్తున్న తాటాకు చప్పుళ్లకు బెదురుతామా...అస్సలు ఆదరము , బెదరము అదే మా శైలి.....!! .

# భూదాన్ భూమిలో నిర్మించిన పక్క ఇండ్లు భూస్థాపితం

## నాలుగు జిల్లాల పోలీస్ బలగాల వలయంలో ఇండ్ల కూల్చివేత

## కన్నింటి పర్యంతంలో నిరుపేదలు సామాన్లు సర్దుకునే సమయం ఇవ్వకుండా ప్రజల ఇండ్లను ఖాళీ చేయించిన అధికార యంత్రాంగం

ఖమ్మం,ఫిబ్రవరి 25(జర్నలిస్ట్ ఫైల్) :ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్ల లో పక్క ఇండ్లు నిర్మించుకుని గత 12(2014) ఏళ్లుగా నివాసం ఉంటున్న పేదల ఇండ్లను ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ పోలీస్,అధికార యంత్రాంగం కలిసి మంగళ వారం పక్క ఇండ్లను భూ స్థాపితం చేశారు. సోమవారం రాత్రి నుంచే వినోభా నగర్ కాలనీ వద్దకు రెవెన్యూ, మున్సిపల్ కార్పోరేషన్,రవాణా శాఖ,అటవీశాఖ, రెవెన్యూ యంత్రాంగం మంది మార్బలం తో రంగ ప్రవేశానికి కాలనీని దిగ్బంధం చేశారు. పక్క ఇండ్లు కూల్చేందుకు జేసీబీలు, క్రేన్లు,సామాన్లు తరలించేందుకు కేఎంసి,ప్రైవేట్ వాహనాలు సిద్ధం చేసుకున్నారు.నాలుగు జిల్లాల అయిన ఖమ్మం,భద్రాద్రి



కొత్తగూడెం,మహబూబాద్, వరంగల్ ల నుంచి సుమారు 600 ల మంది పైగా పోలీస్ బలగాలలు ఎలాంటి వివాదాల కు తావులేకుండా నలుదిక్కుల మోహరించారు. మీడియాకు కవరేజ్ నిమిత్తం అనుమతిని నిరాకరించారు. దింతో తెల్లవారుజామున నుంచే పక్క ఇండ్ల కూల్చి వేతకు ప్రణాళిక చేసుకుని షురూ చేశారు. ఇండ్లు కూల్చివేత సమయంలో ఇంటి యజమాని లేనట్లయితే ఆ ఇంటిని వీడియో రికార్డ్ చేసుకుని,సమాన్లకు ఆర్డీవో,తహసీల్దార్ సమక్షంలో పంచనామా చేసి వస్తు సామాగ్రిని పునరావాస షెల్టర్ కు తరలించి ఇండ్లు కూల్చే పనికి పూనుకున్నారు. దింతో మొన్నటి వరకు కళకళ



ఆడిన వినోభా నగర్ కాలనీ ఇప్పుడు స్మశాన వాటికను తలపిస్తోంది.

### ఖమ్మం అర్బన్ మండలం వెలుగు మట్ల రెవెన్యూ పరిధిల

147,148,149 సర్వే నెంబర్ లలో మొత్తం 31.07 ఎకరాల భూదాన్ భూమి ఉంది.దీనిలో ని 149 సర్వే నెంబర్ లో ఆచార్య వినోభా పేరుతో ఉన్న 1954 వ సంవత్సరం నుంచి రెవెన్యూ రికార్డ్ మేరకు కసరా పహానిలో ఉన్న 27.7 గుంటల భూమిలో ఇతరేతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన సుమారు 8 వందల కుటుంబాలు 2014 వ సంవత్సరం లో భూదాన్ ట్రస్ట్ బోర్డ్ ఆదేశాల మేరకు 100 గజాల చొప్పున భూమిని పంచుకుని గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నట్లు నివాస ప్రజలు తెలిపారు.ఈ క్రమంలో గుడిసెలు వేసుకున్న ప్రజలను ట్రస్ట్ బోర్డ్ పట్టాలు ఇవ్వనున్నట్లు అక్కడి నాయకులు కొందరు వారిని ఉద్దేశ్య పూర్వకంగా ఆశ కల్పించి పక్క ఇండ్లు నిర్మించుకున్న వారికే స్థలం దక్కుతోందని నమ్మబలకడంతో,ఆర్థిక స్థోమత లేకపోయి నప్పటికీ సొంత గ్రామాల్లో ఉన్న వ్యవసాయ భూమిని అమ్ముకుని కొందరూ, ఆడపిల్ల పెండ్లి కొరకు దాచుకున్న సొమ్ముతో మరికొందరు, ఆడవాళ్ల మెడలో ఉన్న బంగారపు పుస్తెలా తాడు ను అమ్మేసి ఇంకొందరూ పక్క ఇండ్లను తీర్చి దిద్ది నిర్మించుకున్నారు. అక్కడి ఇండ్లకు విద్యుత్, తాగునీటి సౌకర్యం లేకపోయిన నాయకుల మాటలు నమ్మి నట్టేట మునిగారు. ఇక్కడ నివసించే ప్రజానీకానికి విద్యుత్,త్రాగు నీరు ఇతరేతర వంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరాకరించింది. చేసేదేమీ లేక అక్కడ లీడర్లుగా చెలామణి అయ్యే వారి మాయమాటలు నమ్మి

### మౌలిక సదుపాయాలు

విద్యుత్,త్రాగు నీటి సౌకర్యం పేరుతో లక్షలాది రూపాయలు అక్కడి నాయకులు దండుకున్నట్లు సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.అంతే కాదు విలువైన భూమి తాము చే జిక్కించుకోవాలంటే న్యాయస్థానం లో ఫైట్ చేయడానికి డబ్బులు అవసరమవుతాయని ఒక్కో ఇంటి యజమాని నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు కూడా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అన్ని విధాలా అక్కడి నిరుపేద ప్రజల్లో ఆశలు కల్పించిన నాయకులు వారి ఇండ్లలో విషాదాన్ని మిగిల్చారు. పక్క ఇండ్లు నిర్మించుకున్న వారికి భూదాన్ ట్రస్ట్ ఇచ్చే పట్టాలు ఇచ్చి హక్కు కల్పిస్తామని చెప్పి,వారు మాత్రం డబ్బులు వెనుకేసుకోవడం బాధాకరం.ఓకే స్థలాన్ని పలువురు పెరిటా మార్చుతూ,లక్షల్లో దండుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.తీరా అధికార యంత్రాంగం ఇండ్లు కూల్చే సమయానికి, అండగా ఉంటామని చెప్పిన నాయకులు వారి పక్షాన కనిపించక పోవడంతో ఆత్మస్థైర్యం కోల్పోయి నిస్సహాయ స్థితిలో కనిపించారు. ముళ్లే,మూట సర్దుకుని వాహనాల్లో నిర్వాసితులు తీసుకెళ్తు కనిపించిన దృశ్యాలు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది.

# జాగ్రత్తగా విద్య విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలను పరిశీలించండి

## నాణ్యమైన డేటా ను రాష్ట్రానికి అందించండి

## జిల్లా విద్యాశాఖ అధికారిణి చైతన్య జైని




ఖమ్మం, ఫిబ్రవరి 25 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ రాష్ట్ర విద్యా శిక్షణ పరిశోధనా మండలి రాష్ట్రవ్యాప్తంగా ఫౌండేషనల్ లిటరసీ, న్యూమరసిపై 33 జిల్లాలలో ఒక శాంపుల్ సర్వేను రెండవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు నిర్వహిస్తున్నది. దీనిలో భాగంగా ఖమ్మం జిల్లాలో కలెక్టర్ ఆదేశాల మేరకు 1 నుండి 5వ తరగతి చదువుతున్నటువంటి విద్యార్థినీ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. దీనికిగాను ఏడు మంది రిసోర్స్ పర్సన్ లు హైదరాబాదులో శిక్షణ పొందారు వారు 23, 24 తేదీలలో జిల్లా విద్యా శిక్షణ సంస్థలో ఎంపిక చేసిన 194 మంది ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణా కార్యక్రమం ముగింపు సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కోర్సు డైరెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైని మాట్లాడుతూ విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలను పరిశీలించేటప్పుడు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని, విద్యార్థులతో వారి స్థాయిలోనే మాట్లాడుతూ అత్యంత జాగ్రత్తగా టాస్క్ షీట్లను చూపిస్తూ ఎప్పటికప్పుడు వచ్చేటువంటి ట్యాంజెరిన్ అనే యాప్ లో నమోదు చేయాలని తద్వారా జిల్లా మరియు రాష్ట్రానికి నాణ్యమైన డేటా అందుతుంది అని పేర్కొన్నారు ఈ సమావేశంలో జిల్లా



అకాడమిక్ మానిటరింగ్ అధికారి పెసర ప్రభాకర్ రెడ్డి, సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్ రాష్ట్ర ప్రతినిధి నిహిత్, రిసోర్స్ పర్సన లు శ్రవణ్ కుమార్, నాగిరెడ్డి, శేషు, సుస్మిత, ఏసుబాబు, స్వాతి, మరియు 134 మంది జిల్లా శిక్షణ సంస్థ విద్యార్థులు, 60 మంది నాలుగు (సెంట్ లారెన్స్, అనిబిసెంట్, ట్రినిటీ మరియు బ్రౌన్స్ )కళాశాలకు చెందిన బిఈడి విద్యార్థులు పాల్గొన్నారు.

## ఖమ్మం భూదాన్ భూముల్లో పేదల గుడిసెల కూల్చివేత

# కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనం

# ఈ సంఘటను తీవ్రంగా ఖండిస్తున్నాం

– మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్



ఖమ్మం, ఫిబ్రవరి 25 (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం వెలుగుమట్ల పరిధిలో ఉన్న 60 ఎకరాల భూదాన్ భూముల్లో పదేళ్లుగా నివసిస్తున్న సుమారు 600 పేద కుటుంబాలపై వేలాది మంది పోలీసులతో దాడి చేసి, జేసీబీల సహాయంతో గుడిసెలను కూల్చివేయడం అమానుషం, అతిక్రూరంగా ప్రజాస్వామ్యాన్ని అవమాన పరిచే చర్య అని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లుగా అక్కడే నివసిస్తూ తమకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని వేడుకుంటూ, న్యాయపరంగా పోరాడుతున్న పేదలపై ఈ విధంగా ప్రతాపం చూపించడం కాంగ్రెస్ ప్రభుత్వ అసలు స్వరూపాన్ని బయటపెట్టిందని మండిపడ్డారు. హైకోర్టు స్టే పేరుతో కొంతమంది ప్రైవేట్ వ్యక్తులకు లబ్ధి చేకూర్చేందుకు స్వయంగా మంత్రి తుమ్మల ఆదేశాలతో రంగంలోకి దిగి పోలీస్ బలగాలను మోహరించి గుడిసెలు కూల్చివేయడం అత్యంత దురదృష్టకరమని విమర్శించారు. భూదాన్ భూములపై ఎప్పటినుంచో కన్నేసిన జిల్లా మంత్రి తుమ్మల సన్నిహితులు రియల్ ఎస్టేట్ వారు ఎప్పటి నుంచో వాటిని ఆక్రమించుకునేందుకు ప్రణాళిక తో పావులు కదుపుతూ ఈరోజు తెల్లవారుజామునే భారీ పోలీస్ బలగాలతో పేదల ఇళ్లను ఖాళీ చేయించడం నిరంకుశ పాలనకు నిదర్శనం అన్నారు. ఇళ్లు కూల్చివేసి నిరాశ్రయులను రోడ్డుపైకి నెట్టివేయడం మానవత్వాన్ని మరిచిన చర్యగా వారు అభివర్ణించారు. బీఆర్ఎస్ పార్టీ ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నదని మాజీ శాసనసభ్యుడిగా,మాజీ జిల్లా మంత్రిగా ప్రజల తరపున అండగా తాను నిలుస్తూ న్యాయపరంగా, ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అధికారం ఉందని పోలీస్ వ్యవస్థను అడ్డుపెట్టుకుని విర్రవీగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన సమయంలో గుణపాఠం చెప్పక తప్పదని స్పష్టం చేశారు.వెంటనే కూల్చివేతలను నిలిపివేసి, అర్హులైన పేద కుటుంబాలకు పట్టాలు మంజూరు చేసి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఘనంగా ప్రత్యేక పూజలు

## నీలం పద్మ, వెంకటస్వామి దంపతులకు ఘన సన్మానం

## పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ బీజని బాలమణి, కాంగ్రెస్ నేతలు



ఆలేరు, ఫిబ్రవరి 25 (జర్నలిస్ట్ ఫైల్) : ఆలేరు నియోజకవర్గం కైలాసపుర కాచారంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### ఆధ్యాత్మిక కార్యక్రమాలు:

మంగళవారం పురస్కరించుకొని అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలేరు మున్సిపల్ చైర్మన్ బీజని బాలమణి భాస్కర్ అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని, ఒడి బియ్యం సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ, అన్నప్రసాద కార్యక్రమం జరిగింది. సిద్దిపేటకు చెందిన వ్యాపారవేత్త చింతరాం దంపతులు ఈ అన్నదాన కార్యక్రమానికి దాతలుగా వ్యవహరించారు.

### నీలం పద్మ-వెంకటస్వామి దంపతులకు సన్మానం:

రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఇంచార్జ్ కోఆర్డినేటర్, జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ మరియు రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ నీలం వెంకటస్వామిల వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. వీరికి పసుపు కుంకుమలు అందించి, వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు.

### పాల్గొన్న ప్రముఖులు:

ఈ కార్యక్రమంలో నాలుగో వార్డు కౌన్సిలర్ బిజిని కళ్యాణి మధు, ఒకటో వార్డు కౌన్సిలర్ పాకాల హరీష్ మౌనిక, ఫెడ్ గ్రామ్స్ అధ్యక్షులు కొత్తూరు నాగరాజు, ముఖ్య అతిథిగా సిద్దిపేట నుంచి జయశ్రీ తదితరులు పాల్గొన్నారు. భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

# ఇంటర్మీడియట్ విద్యార్థులకు శుభాశిస్సులు

## విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి

## పరీక్షల్లో ఉత్తీర్ణులై మంచి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి –పుదారి నర్సింహా గౌడ్



గజ్వేల్, ఫిబ్రవరి 25 (జర్నలిస్ట్ ఫైల్) : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్షలు వ్రాసే గజ్వేల్ నియోజక వర్గం విద్యార్థిని, విద్యార్థులకు బిజెపి రాష్ట నాయకులు నర్సింహా గౌడ్(నందన్ గౌడ్) ఆల్ ది బెస్ట్ చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షలు రాసే విద్యార్థిని విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో రాయాలని మీరు కష్టపడి చదివిన దాన్ని ఇష్టంతో రాసి మంచి ఉత్తీర్ణత సాధించాలని కోరుకుంటున్నానని, మీ మంచి భవిష్యత్తు కి ఇది పునాది లాంటిదని, పరీక్షలు బాగా రాసి మీ తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చి వారి కలలను నిజం చేయాలని ఆకాంక్షించారు. అదే విధంగా మంచి ఉత్తీర్ణత సాధించి తల్లి తండ్రులకు, మీ అధ్యాపకులకు మంచి పేరు తీసుకరావాలన్నారు.

# పేదల గుడిసెల కూల్చివేత అమానుషం : మాజీ ఎంపీ నామ

## ప్రత్యామ్నాయ నివాసం కల్పించకుండా

## కూల్చివేతలు ప్రజాస్వామ్యానికి విరుద్ధం : మాజీ ఎంపీ నామ

## పేదల వేదనకు ప్రభుత్వం బాధ్యత వహించాలి : మాజీ ఎంపీ నామ



ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం నగర కార్పోరేషన్ పరిధిలోని వెలుగుమట్ల భూదాన్ భూములల్లో నివసిస్తున్న వందలాది పేదల గుడిసెలను కూల్చివేయడం అత్యంత దురదృష్టకరమని బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్రంగా ఆక్షేపించారు. ఏళ్ల తరబడి అక్కడ నివసిస్తూ జీవనోపాధి సాగిస్తున్న పేద కుటుంబాలకు ముందస్తు గా ప్రత్యామ్నాయ నివాసం కల్పించకుండా గుడిసెలను కూల్చివేసి వారిని రోడ్డున పడవేయడం అత్యంత దుర్మార్గమైన చర్య" అని నామ ఆగ్రహం వ్యక్తం చేశారు. అప్పులు చేసి, చెమటోడ్చి కట్టుకున్న పేదల ఇళ్లను క్షణాల్లో నేలమట్టం చేయడం పేదల గుండెలను పగలగొట్టే చర్య అని పేర్కొన్నారు. అంతేకాకుండా, ఈ కూల్చివేత సమయంలో మీడియాను కూడా రానివ్వకుండా అడ్డుకోవడం, పారదర్శకత లేకుండా చర్యలు చేపట్టడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. పేదలపై ఇలాంటి కఠిన చర్యలు తీసుకోవడం సరైంది కాదని, ప్రభుత్వానికి బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని సూచించారు. భూదాన్ భూములల్లో నివసిస్తున్న వారి వివరాలు సమగ్ర సర్వే నిర్వహించి, అర్హులైన ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు లేదా స్థలం కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. పేద ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ నిలబడతుందని, వారి హక్కుల కోసం పోరాడతామని నామ స్పష్టం చేశారు. ఖమ్మం నగరంలో అభివృద్ధి అవసరం ఉన్నప్పటికీ, అది పేదల జీవితాలను ఛిన్నాభిన్నం చేసేలా ఉండకూడదని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఆరోగ్య ఉపకేంద్రం వద్ద నీటి కొరతను తగ్గించేందుకు బోరు బావి తవ్వకం



నిజామాబాద్ జిల్లా రూరల్ ప్రతినిధి సిరికొండ మండలం ఫిబ్రవరి 25 (జర్నలిస్ట్ ఫైల్) : సిరికొండ మండలం గడ్కోల్ గ్రామంలో మంగళవారం గ్రామ పంచాయతీ పాలకవర్గం గ్రామంలో గల ఆరోగ్య ఉపకేంద్రం వద్ద ఎలాంటి నీటి ఎద్దడి కొరత ఉండకుండ వచ్చే వేసవికాలన్ని అనుసరించి గ్రామ ప్రజలు ఇబ్బంది పడకుండ బోరు బావి తవ్వకం చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంద్ర లతశంకర్, ఉప సర్పంచ్ రొక్కం సంపత్ రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ మామిడి రాములు, వార్డ్ సభ్యులు పాప గంగారెడ్డి, తలారి హేమంత్, కొమ్మటి గంగాధర్, ఒడ్డెం మౌనిక, అరిగెల సావిత్రి, గుద్దేటి లక్ష్మి, గంభీరావుపేట్ అఖిల్, బుక్య గంగాధర్, మేకల సంధ్య, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నరు.

## నాయకుల ఐక్యతతోనే గ్రామాల ప్రగతి సాధ్యం



కేశంపేట, (జర్నలిస్ట్ ఫైల్) : స్వర్ణ భారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో ముచింతల్ లో నిర్వహించిన సర్పంచుల శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ సర్పంచ్‌లు హాజరై గ్రామాభివృద్ధి అంశాలపై చర్చించారు. చింతకుంటపల్లి సర్పంచ్ పోచమోని రమేష్ యాదవ్ మాట్లాడుతూ .. గ్రామాల్లో అభివృద్ధి జరగాలంటే పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యేలు నిధులు కేటాయించాలని కోరారు. గ్రామంలోని నాయకులు అందరూ కలిసి పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమని అన్నారు.ఎమ్మెల్యే శంకరయ్య స్పందిస్తూ రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితమని, గ్రామాభివృద్ధి విషయంలో ఏ పార్టీకి చెందిన సర్పంచ్ అయినా తన సహకారం ఉంటుందని తెలిపారు. గ్రామంలో అభివృద్ధిని ఎవరైనా అడ్డుకుంటే వారితో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. నాయకుల ఐక్యత, ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



## నర్రపల్లి గ్రామంలో సెల్ ఫోన్ సిగ్నల్ సమస్య తీరినట్లే

**నర్రపల్లి గ్రామ సర్పంచ్ ఓర్సు హేమలత శ్రీహరి,**
**ఉప సర్పంచ్ వేగల వేణుగోపాల్ రెడ్డి.**
**నెట్వర్క్ సంస్థ బిఎస్ఎన్ఎల్ కోసం స్థలం సేకరణ.**



ఇబ్రహీంపట్నం ఫిబ్రవరి 25 (జర్నలిస్ట్ ఫైల్) : సోమవారం ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని నెర్రపల్లి గ్రామానికి బిఎస్ఎన్ఎల్ నెట్వర్క్ కోసం సర్పంచ్ హేమలత శ్రీహరి పిలుపు మేరకు ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ శ్రీధర్ అలాగే డిప్యూటీ జనరల్ మేనేజర్ దినేష్ అలాగే జితేందర్ సింగ్ గ్రామానికి విచ్చేసి బిఎస్ఎన్ఎల్ నెట్వర్క్ విస్తరించడానికి స్థలాన్ని చూడడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో సర్పంచ్ ఓర్సు హేమలత శ్రీహరి అలాగే ఉప సర్పంచ్ వెలగ వేణుగోపాల్ రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.



## పేదల గుడిసెలు కూల్చడమే ఇందిరమ్మ రాజ్యమా?

**భూదాన్ భూముల్లో ప్రభుత్వ చర్యను ఖండించిన ఎంపీ రవిచంద్ర**



ఖమ్మం,ఫిబ్రవరి 25(జర్నలిస్ట్ ఫైల్):ఖమ్మం నగర శివారులోని భూదాన్ భూముల్లో పదేళ్లుగా నివాసం ఉంటున్న పేదల గుడిసెలను కాంగ్రెస్ ప్రభుత్వం దుర్మార్గంగా కూల్చి వేయడాన్ని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తీవ్రంగా ఖండిచారు. అక్కడ నివాసముంటున్న సుమారు 600 పేద కుటుంబాలపై వందలాది మంది పోలీసులు, పదుల సంఖ్యలో జేసీబీలు, ట్రాక్టర్లతో తెల్లవారు జామున్నే దాడి చేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పదే పదే ఇందిరమ్మ రాజ్యం అని ప్రగల్భాలు పలికే కాంగ్రెస్ నేతలు పేదల ఇల్లు కూల్చడమే ఇందిరమ్మ రాజ్యమా సమాధానం చెప్పాలని ఆయన నిలదీశారు. పేదల గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని వేడుకుంటూ, న్యాయపరంగా పోరాడుతున్న పేదలపై ప్రభుత్వం దుర్మార్గంగా విరుచుకుపడటం ద్వారా కాంగ్రెస్ అసలు స్వరూపాన్ని బయటపెట్టిందని మండిపడ్డారు. గుడిసెల తొలగింపును బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని, బాధితులకు అండగా ఉంటామని ఎంపీ రవిచంద్ర హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పేద ప్రజలపై నిజంగా సానుభూతి ఉంటే తక్షణమే అక్కడి అర్హులైన పేద కుటుంబాలకు పట్టాలు మంజూరు చేయాలని వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు.

## కొమిరిశెట్టి శ్రీధర్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళకు ఘన సన్మానం





వైరా, (జర్నలిస్ట్ ఫైల్) : వైరాలో కొమిరిశెట్టి శ్రీధర్ చిట్ ఫండ్ కంపెనీ నందు నూతనంగా మొట్టమొదటిసారిగా మహిళా మున్సిపల్ చైర్మన్ గా పదవి బాధ్యతలు చేపట్టిన డాక్టర్ కాపా చంద్రకళను, మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ ను, 2 వార్డ్ కౌన్సిలర్ తిరుపతి శివకుమారి,12 వ వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత, 13 వ వార్డు కౌన్సిలర్ ముల్లపాటి విజయలక్ష్మిని వారి ఇంటి వద్ద అత్యంత ఘనంగా సన్మానించారు. అనంతరం డాక్టర్ కాపా చంద్రకళ మాట్లాడుతూ ఆరో వార్డు ప్రజలు నన్ను గెలిపించి నందు కు ముందు గా కృతజ్ఞతలు తెలియాచేశారు. వైరా మున్సిపాలిటీ అందరి కౌన్సిలర్ల సహకారంతో నెంబర్ వన్ గా ఉంచుతానని పారదర్శకతతో పనిచేస్తామని అవినీతి రహిత పాలన అందించటమే నా ముఖ్య ఉద్దేశం అని ఆమె తెలిపారు. వార్డులలో ముఖ్యమైన సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. డాక్టర్ కాపా మురళీకృష్ణ మాట్లాడుతూ లయన్ మెంబర్లు ఆరుగురు మహిళలు కౌన్సిలర్ గా ఎన్నిక కావడం సంతోషమని, జిల్లాలోని లయన్ మెంబర్లు నలుగురు మున్సిపల్ చైర్పర్సన్లుగా ఎన్నికయ్యారని ఈ సందర్భంగా తెలిపారు. సేవే మార్గంగా పనిచేస్తూ సమాజంలో ఉన్న ప్రజలకు సేవలందించడం ద్వారానే ప్రజా ప్రతినిధులుగా ఎన్నిక కాబడ్డారని ఆయన అన్నారు. వైస్ చైర్మన్ కట్ల సంతోష్, ముళ్ల పాటి సీతా రాములు మాట్లాడుతూ మున్సిపాలిటీని జిల్లాలోని మోడల్ మున్సిపాలిటీగా మునిసిపల్ చైర్మన్ చంద్రకళ సహకారంతో ముందు ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షులు వనమా విశ్వేశ్వరరావు, ఆర్యవైశ్య కళ్యాణ మండపం అధ్యక్షులు డాక్టర్ పెరుమాళ్ళ కృష్ణమూర్తి, లగడపాటి ప్రభాకర్ రావు, నూకల శ్రీనివాసరావు, నూకల ప్రసాదరావు, చింతోజు నాగేశ్వరరావు, పెనుగొండ ఉపేందర్ రావ్, గద్దె నీరజ, చెరుకూరి శ్రీనివాసరావు, నంబూరి రామారావు, నంబూరి శ్రీనివాసరావు, ఏపూరి రాజారావు, కొల్లా రాంబాబు, కట్ల సురేష్, మిట్టపల్లి శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, సుగ్గల మాధవి తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.





# మేలో ఏలూరులో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మహా సభలు

**ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య**




ఏలూరు,ఫిబ్రవరి 25 (జర్నలిస్ట్ ఫైల్) : మే నెలలో ఏలూరులో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య చెప్పారు. ఏలూరులోని అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వి. కృష్ణయ్య మాట్లాడుతూ ప్రతి మూడేళ్లకు ఒకసారి నిర్వహించే రైతు సంఘం రాష్ట్ర మహాసభలు



రాష్ట్రంలోని రైతాంగాన్ని మరింత ఐక్యం చేసే విధంగా ఈసారి ఏలూరులో నిర్వహించేందుకు రైతు సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం నిర్ణయించిందని ప్రకటించారు. ఈ మహాసభల నిర్వహణకు అందరూ సహకరించాలని కోరారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం వలన మన వ్యవసాయం రంగం మరింత సంక్షోభంలో కూరుకు పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా నుండి 13 రకాల పంటలు ఎటువంటి సుంకాలు లేకుండా దిగుమతి అయితే ఆయా పంటల ధరలు పడిపోతాయని చెప్పారు. వ్యవసాయ నష్టాలతో ఇప్పటికే అప్పుల ఊబిలో కూరుకుపోతున్న రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా పది రకాల చట్టాలు తీసుకువచ్చిందని చెప్పారు. విత్తన చట్టం, విద్యుత్ చట్టం, డిజిటల్ అగ్రి మిషన్, వ్యవసాయం మార్కెట్ చట్టాలు వంటివి అన్నీ కార్పొరేట్ కంపెనీల అనుకూల చట్టాలేనని విమర్శించారు. రైతులు కోరుతున్న మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావడం లేదన్నారు. రైతాంగ వ్యతిరేక విధానాలపై పోరాటం తప్ప మరో మార్గం లేదని అందుకు రైతాంగం సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. జిల్లాలో రైతాంగం అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని కోరారు. చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతాంగానికి ప్రైవేట్ మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఖరీఫ్ ధాన్యం అమ్మిన రైతులకు ఇవ్వాల్సిన ధాన్యం రవాణా కిరాయిలు, హమాలీ చార్జీలు వెంటనే చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా సీనియర్ నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు, జిల్లా ఉపాధ్యక్షులు కోన శ్రీనివాసరావు, జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు ఘంటా అప్పారావు, సున్నా వెంకట్రావు, లావేటి సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

# చట్టపరమైన చర్యలకు మాకేం సంబంధం

**మహిళా ఉద్యోగినిని దుర్భాషలాడితే వత్తాసు పలకాలా..?**


**తప్పుడు పనులు చేస్తూ అధికార పార్టీపై బురదజల్లుతారా..?**

**బాధిత ఉద్యోగిని ఫిర్యాదు చేస్తే, కాంగ్రెస్ పై నిందలా..?**

**ప్రత్యక్ష వీడియోలు ఉన్నా సీపీఐ నేతలకు కనిపించట్లేదా?**

**చేసేవి చేస్తూ స్థానిక కాంగ్రెస్ నాయకులపై విషం చిమ్మడం సీపీఐ కే చెల్లింది**

**మీడియా సమావేశంలో ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు**



ఏదులాపురం, (జర్నలిస్ట్ ఫైల్) : అవుట్ సోర్సింగ్ హౌసింగ్ ఉద్యోగినిపై అమర్యాదగా, అనుచితంగా వ్యవహరిస్తూ, దుర్భాషలాడిన ఏదులాపురం మాజీ సర్పంచ్, సీపీఐ ఖమ్మం రూరల్ మండల నాయకులు చెరుకుపల్లి భాస్కర్ పై చట్టపరమైన చర్యలకు మాకు ఎలాంటి సంబంధం లేదని ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు తెలిపారు. తప్పుడు పనులు చేస్తూ అధికార పార్టీపై బురదజల్లటం ఆ పార్టీ నాయకులకే చెల్లిందన్నారు. వరంగల్ క్రాస్ రోడ్డులోని 29వ వార్డులో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. గృహ నిర్మాణ శాఖ ఉద్యోగ విధుల్లో భాగంగా సిబ్బందితోపాటు కలిసి వచ్చిన మహిళా ఉద్యోగినిని వందలాదిమంది చూస్తుండగా చెరుకుపల్లి భాస్కర్ దుర్భాషలాడారని, ఇదే విషయమై ఆమె ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారన్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలతో సహా సోషల్ మీడియాలో తిరుగుతున్నా, స్థానిక సీపీఐ నాయకులు 'మసిపూసి మారేడు కాయ చేయాలని' చూస్తుండటాన్ని తప్పుబట్టారు. జరిగిన ఘటనకు చింతించకుండా అధికార పార్టీ స్థానిక నాయకులపై అవాకులు చెవాకులు పేలుతుండటాన్ని ఖండించారు. మహిళా ఉద్యోగినిని దుర్భాషలాడితే వత్తాసు పలకాలనే రీతిలో సీపీఐ నాయకులు మాట్లాడుతుండటం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. చేసేవి చేస్తూ స్థానిక కాంగ్రెస్ నాయకులపై విషం చిమ్మడం సీపీఐ ఏదులాపురం నాయకుల కే చెల్లిందన్నారు. సీపీఐపై రాజకీయ కక్షలు పెట్టుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు. జరిగిన ఘటనను వక్రీకరించే రీతిలో ఆ పార్టీ నాయకుల వ్యవహార శైలి ఉంది తప్ప సోషల్ మీడియాలో వచ్చిన ఆ ఘటన వీడియోలు జనం చూశారు. దానిని సరిదిద్దు కోవాలనే ఇంగితం లేకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా ఏదులాపురం సీపీఐ నాయకులు గుడ్డ కాల్చి మీదేసే ధోరణి మానుకొని, వాస్తవాలను గ్రహించి కాంగ్రెస్ మీద ఆరోపణలు మానుకుంటే మంచిదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, 29వ వార్డ్ కౌన్సెలర్ వెంపటి ఉమా వెంకటేశ్వర్లు, భూక్యా సురేష్ నాయక్, వెంపటి రవి,వెంపటి సురేష్, ప్రద్యుమ్న చారి, నూకల రామ్మోహన్ రెడ్డి, కె. శిరిషా రంజిత్ రెడ్డి, కళ్యాం శేషిరెడ్డి, ఎర్ర శేఖర్ రెడ్డి, రామిశెట్టి రమేష్, అశోక్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, సురేష్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రమేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇది ప్రజాస్వామ్యమా?

**లేక పోలీస్ రాజ్యమా?**

**ఖమ్మం గుమ్మంలో పేదల ఇళ్ల కూల్చివేతలపై హరీశ్ రావు**






హైదరాబాద్, ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : ఖమ్మం నగరం వెలుగుమట్ల వినోబా నగర్ కూల్చివేతలను మాజీ మంత్రి హరీశ్ రావు ఖండించారు. అప్పులు చేసి పేదలు నిర్మించుకున్న ఇళ్లను వేల మంది పోలీసుల పహారాలో కూల్చివేయడం అత్యంత హేయమైన చర్య అని ఈ రాక్షస కాండను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. ఈ మేరకు ఇవాళ ఓ ప్రకటన విడుదల చేసిన హరీశ్ రావు ఇది ప్రజాస్వామ్యమా? లేక పోలీస్ రాజ్యమా? అని ప్రశ్నించారు. నాలుగు జిల్లాల నుండి వేల మంది పోలీసులను మోహరించి, ఒక యుద్ధ వాతావరణాన్ని సృష్టించి ఇళ్లను కూల్చాల్సిన అవసరం ఏమొచ్చింది, పేద ప్రజలు మీకేమైనా తీవ్రవాదుల్లా కనిపిస్తున్నారా అని నిలదీశారు.

### ఈ ప్రభుత్వాన్ని దహించి వేయడం ఖాయం

పోలీసులను అడ్డం పెట్టుకుని మీడియాను రాకుండా అడ్డుకుంటున్నారంటేనే మీరు చేస్తున్న అరాచకం లోకానికి తెలియకూడదనే మీ భయం అర్థమవుతోందని చీకటి పనులు చేసేవారే మీడియాను చూసి భయపడతారన్నారు. మేము అధికారంలోకి వస్తే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం అని నమ్మబలికిన రేవంత్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు నేడు ఉన్న ఇళ్లను కూలగొట్టి పేదలను నడిరోడ్డుపై నిలబెడుతున్నారని ధ్వజమెత్తారు. ఓటు వేసినందుకు మాకు తగిన శాస్తి జరిగింది అని బాధితులు రోదిస్తుంటే గుండె తరుక్కు పోతున్నదన్నారు. ఎంతో కష్టపడి, రూపాయి రూపాయి పోగేసి కట్టుకున్న ఇళ్లను ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ప్రత్యామ్నాయం చూపకుండా కూల్చడం అమానుషం అన్నారు. బాధితుల ఆవేదన రేపు ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని దహించి వేయడం ఖాయం అన్నారు.

### ఇంచు భూమి కూడా కదిలించడానికి వీల్లేదు

వెంటనే ఈ అక్రమ కూల్చివేతలను ఆపి పోలీసులు వెనక్కి వెళ్లాలన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ వారికి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. పేదలపై కర్రలు ఎత్తడం మానేసి, వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై దృష్టి పెట్టాలని, పేదల గూడు చెదిరితే.. మీ అధికారం గద్దెలు అంతే వేగంగా కూలుతాయని హెచ్చరించారు. వెంటనే కూల్చివేతలు ఆపి బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు ప్రత్యామ్నాయం చూపకుండా ఇంచు భూమి కూడా కదిలించడానికి వీల్లేదని పేదల పక్షాన బీఆర్ఎస్ పార్టీ నిలబడు తుందన్నారు. ఖమ్మం బిడ్డల కన్నీళ్లకు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

## సమస్యల పరిష్కారానికి నూతన పాలకవర్గం కృషి చేయాలి

**– కొల్లు వెంకటేశ్వర రావు**



కోదాడ, (జర్నలిస్ట్ ఫైల్) : కోదాడ పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి పురపాలక సంఘ నూతన పాలకవర్గం తక్షణమే కృషి చేయాలని తెలుగు రైతు సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కొల్లు వెంకటేశ్వరరావు డిమాండ్ చేసారు. పట్టణంలోని పలు వార్డులలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కరెంటు స్తంభాలు, స్ట్రీట్ లైట్లు, పారిశుధ్యం, త్రాగునీరు తదితర మౌళిక సదుపాయాల కల్పనకు త్వరితగతిన కృషి చేయాలని చెప్పారు. వార్డులలో వారానికి కేవలం రెండు రోజులు మాత్రమే ఇండ్ల వెంట చెత్త సేకరిస్తున్నారని, అలా కాకుండా కనీసం రోజు విడిచి రోజైనా చెత్తను సేకరించాలని కోరారు. పట్టణంలోని ప్రధాన రహదారుల మీద పశువుల సంచారాన్ని, మాంసం విక్రయాలను, ఫ్లెక్సీలు కట్టడాన్ని, ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని కఠినంగా నిరోధించాలని డిమాండ్ చేసారు. పెద్ద చెరువు కట్ట మీద ఆకతాయిలు మద్యం తాగి, ఖాళీ సీసాలను పగులకొట్టి నడిచే దారి మీదే వేస్తున్న గాజు ముక్కలను ఎప్పటికప్పుడు తొలగించాలని, కరెంటు స్తంభాలకు కాలిపోయిన బల్బుల స్థానంలో కొత్త బల్బులను ఏర్పాటు చేసి మార్నింగ్ వాకర్స్ కు ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

## సంక్షేమ పథకాలే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీని గెలిపించాయి



ఫిబ్రవరి25(జర్నలిస్ట్ ఫైల్): వైరా మున్సిపాలిటీ పరిధిలోని 17 వ వార్డ్ (పల్లిపాడు గ్రామం) లో నిన్న రాత్రి అక్కడి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అభిమానులు ఆహ్వానం మేరకు రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ ఉపాధ్యక్షులు బొర్రా రాజశేఖర్ పాల్గొన్నారు. కార్యకర్తలు పూలుచల్లుతూ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సభ లో బొర్రా మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లోని ప్రభుత్యం పేదప్రజానీకానికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ ప్రజల అభిమానాన్ని చురుగొన్నారని అందుకే పంచాయతీ మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ కి ప్రజలు బ్రహ్మరథం పట్టారని అన్నారు. మీకు ఏ సమస్య వచ్చిన అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో నాలుగో వార్డు కౌన్సిలర్ బొర్రా ఉమాదేవిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఓర్సు రాధాకృష్ణ, బత్తుల శేషగిరి, ఓర్సు పరుశరాం, షేక్ సమీర్, ఓర్సు శివ, దేవళ్ల లక్ష్మణుడు, మాచర్ల నాగరాజు, బత్తుల శ్రీను, బత్తుల భాస్కర్, ఓర్సు బాలరాజు, డాక్టర్ నాగేశ్వర్ రావు, తమ్మారపు వెంకటేశ్వర్లు, రాయల రామ లక్ష్మణుడు, ఓర్సు పెద్ద వెంకన్న, ఈడ సత్యం, రాయల వెంకటేశ్వర్లు, షేక్ ఇమామ్‌వుద్దీన్, రాయల రామకృష్ణ, షేక్ చిన్న సైదులు, మాచర్ల సత్యం, షేక్ కాశీం తదితరులు పాల్గొన్నారు.

## డి.పి.ఆర్.సి భవనాన్ని తనిఖీ చేసిన అదనపు కార్యదర్శి



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖకు అదనపు కార్యదర్శి అశోక్ కుమార్ లోహాని, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ సంచాలకులు ఎం. కృష్ణ తేజతో కలసి జిల్లా పంచాయతీరాజ్ వనరుల భవనాన్ని బుధవారం (డి.పి.ఆర్.సి) తనిఖీ చేశారు. కొల్లిపర మండలం కుంచవరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న గ్రామ పంచాయతీ భవనాన్ని కూడా తనిఖీ చేశారు. పనులు జరుగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛ రథంను ప్రారంభించారు.
గుంటూరు విచ్చేసిన అదనపు కార్యదర్శికి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ టి. క్రిస్టినా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి. జ్యోతి బసు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి. శంకర్, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్షలను తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** ఇంటర్మీడియట్ పరీక్షలను జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ బుధవారం పరిశీలించారు. ఎన్.టి.ఆర్ స్టేడియం దగ్గరలో గల ఎస్.ఆర్ జూనియర్ కళాశాలలోను, అయ్యప్ప స్వామి ఆలయం దగ్గరలో ఉన్న నారాయణ జూనియర్ కళాశాలలో పరీక్షలు జరుగుతున్న తీరును గమనించారు. పరీక్ష కేంద్రాల్లో వసతులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పర్యవేక్షక అధికారి జి.సునీత పాల్గొని వివరాలు తెలిపారు.

## శారీరక విభిన్న ప్రతిభావంతుల ఇంటర్వ్యూకు 158 మంది హాజరు



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాలో శారీరక విభిన్న ప్రతిభావంతులకు మూడు చక్రాల స్కూటర్లకు నిర్వహించిన ఇంటర్వ్యూలకు 158 మంది అభ్యర్థులు హాజరు అయ్యారు. జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అధ్యక్షతన గుంటూరు పట్టణం బృందావన్ గార్డెన్స్ ఒకటవ లైన్ లో ఉన్న ఎన్.టి.ఆర్ స్టేడియంలో ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు జిల్లా ఎంపిక కమిటి ఇంటర్వ్యూలను నిర్వహించింది. కమిటీ సభ్యులు డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వి.విజయ లక్ష్మి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు. చెన్నయ్య, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి పి.మురళీధర్, విభిన్న ప్రతిభావంతుల, హిజ్రాల , వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఎన్.వెంకటరవణప్ప తదితరులు పాల్గొన్నారు.

## సెక్యూరిటీ గార్డ్స్ పోస్టులకు ఎక్స్‌సర్వీసుమెన్ నుండి దరఖాస్తులు ఆహ్వానం

**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** బాపట్ల ఓడరేవు లైట్ హౌస్ లో సెక్యూరిటీ గార్డ్స్ పోస్టులకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎక్స్ - సర్వీసుమెన్ నుండి దరఖాస్తులు ఆహ్వానించడం జరుగుతుందని జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఆర్.గుణశీల తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాపట్ల ఓడరేవు లైట్ హౌస్ లో 3 పోస్టులు ఉన్నాయని చెప్పారు. అర్హత, ఆసక్తి కలిగిన 50 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన మాజీ సైనికులు తమ ధరఖాస్తులు, సంబంధిత పత్రాల జిరాక్స్ ప్రతులు రెండు సెట్లుతో జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయములో ఈ నెల 27వ తేదీ లోగా సంప్రదించాలని కోరారు.
విశాఖపట్నంలో లైట్ హౌస్, లైట్ ఏపీ డైరెక్టరేట్ పోర్టులు, నౌకాశ్రయాలు, జలమార్గాల మంత్రిత్వ శాఖ ఆదీనంలో సంస్థ, ఆంధ్ర తీర ప్రాంతంలోని 10 లైట్ హౌస్ స్టేషన్లలో విధులు నిర్వహించుటకు ఆయుధ రహిత ఎక్స్-సర్వీసుమెన్ సెక్యూరిటీ గార్డ్స్ గా మాజీ సైనికులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియమించుటకు చర్యలు చేపట్టారని తెలిపారు. మొత్తం 30 మందిని భర్తీ చేయుటకు అవకాశం ఉందని చెప్పారు.

## అత్యంత వైభవోపేతంగా మఠాధిపతి పట్టాభిషేక మహోత్సవాలు



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్): జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మఠం నందు నూతన మఠాధిపతుల పట్టాభిషేకం మహోత్సవాలలో రెండో రోజు జరిగిన పూజా కార్యక్రమాలు వేదోపనిషత్ పారాయణ గోపూజ గణపతి పూజ పంచవ్యప్రాసన కూస్మాండ సూక్త పారాయణ అవహేత మండపచనలు సూర్యప్రాసన సూర్య నమస్కారాలు హోమము సప్త సాగర జీవనదుల వైదిక పూర్వక కలిశావహనములు రుద్ర హోమం శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారు కాలజ్ఞానం చూలిక హోమాలు ధూప దీప నైవేద్య మంత్రపుష్ప నీరాజన తీర్థ ప్రసాదాలు సాయంత్రం నిత్య విధులు సామ్రాజ్యం మహాలక్ష్మి సూప్త పారాయణం హోమములు సత్యం నాగర జీవనదుల మంత్రజలాలతో విశేషసన్నపం వైదిక హోమం వేద పారాయణం మంత్రపుష్పం చతుర్వేద స్వస్తి మొదలగు కార్యక్రమాలలో పాల్గొన్న నూతన మఠాధిపతులు పూజ శ్రీ శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాముల వారు మరియు వారి ధర్మపత్ని ఉమాదేవి అమ్మగారు కార్యక్రమాల మఠం ఆస్థాన సిద్ధాంతాలు మరియు పురోహిత వేదమంత్రాల అశేష భక్త జనవాలి మధ్య అత్యంత వైభవోపేతంగా నిర్వహించడం జరిగింది.

## మంగళగిరిలో శరవేగంగా పలు అభివృద్ధి పనులు

- రూ. 35 లక్షల సీఎస్ఆర్ నిధులతో అంగన్వాడీ, పాఠశాల భవనాలు ఆధునీకరణ
- విద్యార్థులకు అందుబాటులోకి ఆధునిక సౌకర్యాలు





మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ చొరవతో మంగళగిరి నియోజకవర్గం రూపురేఖలు శరవేగంగా మారుతున్నాయి. ఇప్పటికే వందల కోట్ల రూపాయలతో నియోజకవర్గంలో మౌలిక సౌకర్యాల కల్పనకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో మంగళగిరి మండలం, ఆత్మకూరు గ్రామంలో కోకా కోలా ఇండియా వారి సీఎస్ఆర్ నిధులు రూ. 35 లక్షలతో పలు అంగన్వాడీ, పాఠశాలలో వివిధ రకాల అవసరాలు, అభివృద్ధి చర్యలు చేపట్టారు. అంగన్వాడీ-52, అంగన్వాడీ-53, అంగన్వాడీ-54 లను ఆధునికరించారు. అంగన్వాడీ-62 కు స్మార్ట్ టీవీ అందజేశారు. అలాగే జిల్లా పరిషత్ హైస్కూలును ఆధునీకరించి ఒక మోనిటర్, రెండు స్పీకర్లు, ఒక డెస్క్‌టాప్, 6 సీసీ కెమెరాలు, 20 జతల స్పోర్ట్స్ డ్రస్‌లు అందజేశారు. మంత్రి నారా లోకేష్ కృషితో మంగళగిరి ప్రజలు, స్థానిక విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి రావడం పట్ల విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## జనసేన సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

- జిల్లా సభ్యత్వ నమోదు సమన్వయకర్త, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్




**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త ముందుకు రావాలని గుంటూరు జిల్లా సభ్యత్వ నమోదు సమన్వయకర్త, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ పిలుపునిచ్చారు. ఈనెల 26నుండి జనసేన సభ్యత్వ నమోదు ప్రక్రియ పై,స్థానిక బోస్ రోడ్ లోని కూటమి పార్టీల కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సమావేశంలొ పాల్గొన్న ఎమ్మెల్సి పిడుగు హరిప్రసాద్ మాట్లాడుతు
జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.
తెనాలిలో ప్రతి మండలం, గ్రామం, వార్డు స్థాయిలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే దిశగా ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం కీలకమని తెలిపారు. యువత, మహిళలు, రైతులు, కార్మికులు సహా అన్ని వర్గాల ప్రజలు, పెద్ద సంఖ్యలో సభ్యత్వం నమోదు చేసుకునేలా కార్యాచరణ ఉండాలన్నారు.
జనసేన పార్టీని బలోపేతం చేయడం ద్వారా ప్రజాస్వామ్య పరిరక్షణ, పారదర్శక పాలన సాధ్యమవుతుందని పేర్కొన్నారు.
ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా తీసుకుని సభ్యత్వ నమోదు లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు పాల్గొన్నారు.

## పట్టాభిషేకం సందర్భంగా వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలి

- స్థానిక ఎంపీడీవోకు ఎంపీపీ వీరనారాయణరెడ్డి ఆదేశం



బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్)
నేడు అత్యంత వైభవపేతంగా జరగనున్న శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాములవారి మఠం మఠాధిపతి పట్టాభిషేకం గావిస్తున్న సందర్భంలో దక్షిణాది రాష్ట్ర నలుమూలల నుండి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాటు చేయాలని బి.మఠం ఎంపీడీవో రామచంద్రారెడ్డికి బి.మఠం ఎంపీపీ చిలేఖాంపల్లి వీరనారాయణరెడ్డి ఆదేశించారు. బ్రహ్మంగారిమఠంలోని అన్ని పురవీధులన్నీ శుభ్రంగా ఉంచాలని,దుమ్ము,ధూళి లేకుండా ట్రాక్టర్లతో నీళ్లు చల్లించాలని ఆయన సూచించారు. స్థానిక పంచాయతీ అధికారులు అప్రమత్తంగా ఉండి పై ఏర్పాట్లన్నీ సవ్యంగా జరిగేటట్లు చూడాలని ఆయన ఎంపీడీవోకు సూచించారు.

## మఠాధిపతి పట్టాభిషేకానికి ఏర్పాట్లు సర్వం సిద్ధం

- టీడీపీ మండల ఉపాధ్యక్షుడు & మైకూర్ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ శీలం నరసింహ గౌడ్



బ్రహ్మంగారి మఠం ( జర్నలిస్ట్ ఫైల్)
జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం నందు అత్యంత వైభవోపేతంగా జరుగుతున్నటువంటి 8వ తరం 12వ పీఠాధిపతులు శ్రీ శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాముల వారి పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమాలు ఏర్పాట్లు పూర్తిస్థాయిలో సిద్ధం చేశారు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఐదు స్టాల్స్ లో భోజన కార్యక్రమాలు భక్తులకు ఎండ వేడిమి తట్టుకునే విధంగా మజ్జిగ వాటర్ వాలంటీర్ల ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరుగుతుంది. దక్షిణాది రాష్ట్రాల నుంచి స్వామి వారి శిష్యులు భక్తులు పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమానికి విచ్చేసి స్వర్ణ కిరీట ధారణ సింహాసన ధారణ కార్యక్రమాన్ని వీక్షించి స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరినట్లు తెలిపారు

## లండన్‌లో తెలుగు యువకుడి మృతి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లి, ప్రయోజకుడవు తాడనుకున్న ఆ ఇంటి ఆశల దీపం ఆరిపోయింది. లండన్‌లో జరిగిన ఒక ఘోర అగ్నిప్రమాదంలో కాకినాడ జిల్లా పెద్దాపురం నియోజకవర్గ పరిధిలోని కొండయ్యపేటకు చెందిన గొంతి అభిషేక్ (28) మృతి చెందాడు. ఈ వార్తతో ఆ గ్రామంలో ఒక్కసారిగా విషాద ఛాయలు అలుముకున్నాయి. అభిషేక్ తండ్రి అస్కారరావు ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీహెచ్ఓ (జనూ)గా విధులు నిర్వహిస్తున్నారు. తన కుమారుడిని ఉన్నత విద్యావంతుడిగా చూడాలన్న ఆకాంక్షతో మూడేళ్ల క్రితం ఆయన అభిషేక్‌ను ఎంబీఏ చదివేందుకు లండన్ పంపారు. చదువు పూర్తయిన తర్వాత అభిషేక్ అక్కడే ఒక సంస్థలో ఉద్యోగం సంపాదించి స్థిరపడ్డాడు. కేవలం ఆరు నెలల క్రితమే ఆయన స్వస్థలానికి వచ్చి కుటుంబ సభ్యులతో సరదాగా గడిపి వెళ్లాడు. అంతలోనే ఈ ఘోరం జరగడం ఆ కుటుంబాన్ని కోలుకోలేని దెబ్బ తీసింది. అగ్నిప్రమాదం వివరాల్లోకి వెళితే... అభిషేక్ నివసిస్తున్న రెండంతస్తుల భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో లోపలే చిక్కుకుపోయిన ఆయన, మంటల తీవ్రతకు ఊపిరాడక ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. మరోవైపు, అభిషేక్ మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వస్థలానికి తీసుకువచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

## మంగళగిరిలో జనసేన ఎదగకుండా ఉండేందుకు చాలా శక్తులు కృషి చేస్తున్నాయి

- వారికి మా పార్టీలోనే కొందరు నేతల మద్దతు ఉంది
- జనసేనలో సభ్యత్వం లేని వారికి నామినేటెడ్ పదవులు
- లోపాలను ఎత్తి చూపినందుకే నన్ను పదవి నుంచి తప్పించారు
- జనసేన పార్టీ నాయకులు కాపరౌతు సుందరయ్య



మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్): జనసేన పార్టీని మంగళగిరి నియోజకవర్గంలో ఎదగనీయకుండా ఉండేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఆ పార్టీ నాయకులు కాపరౌతు సుందరయ్య అన్నారు. అటువంటి వారికి జనసేన పార్టీలోని కొందరు మద్దతిస్తున్నారని ఆరోపించారు . బుధవారం మధ్యాహ్నం మంగళగిరిలోని ప్రెస్ క్లబ్ నందు సుందరయ్య విలేకరుల సమావేశంలో సుందరయ్య మాట్లాడుతూ, జనసేన పార్టీలో సభ్యత్వం లేని వారికి, మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ట్రస్ట్ బోర్డ్, వ్యవసాయ మార్కెట్ కమిటీలలో నామినేటెడ్ పదవులు వరించాయని విమర్శించారు. 2014 నుంచి జనసేన పార్టీలో పనిచేస్తున్న వారికి పదవులు దక్కలేదని, 2024లో ఎన్నికల తర్వాత వైసిపి నుండి పార్టీలోకి వచ్చిన వారికి సభ్యత్వం లేని వారికి పదవులు రావటం దుర్మార్గమని అన్నారు. దీనికి కేవలం నాయకత్వం పైనే తమకు అనుమానం కలుగుతుందని పేర్కొన్నారు. రోజు వారి పార్టీ కార్యక్రమాల్లో ఇంచార్జ్ తప్ప మిగిలిన నాయకులు వేదికపై కనిపించరని తెలిపారు. సమాచారం లేకనే నాయకులు పార్టీ కార్యక్రమాలకు దూరమవుతున్నారని అన్నారు. కొందరి నాయకుల వలన మంగళగిరిలో జనసేన పార్టీ ఎదుగు, బొద్దుగూ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**లోపాలను ఎత్తి చూపినందుకు పదవి నుంచి తప్పించారు**

జనసేన పార్టీలో ఉన్న లోపాలను ఎత్తి చూపినందుకు తనను ఎర్రబాలెం గ్రామ అధ్యక్ష పదవి నుంచి తప్పించారని సుందరయ్య తెలిపారు. గత ఎన్నికల్లో ఎర్రబాలెం గ్రామంలో 5 వేల రికార్డు మెజార్టీ వచ్చిందంటే తామ కృషికి నిదర్శనమని అన్నారు. స్థానిక నాయకులను చూసి కాదని కేవలం జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆశయ సాధన కోసం పని చేస్తున్నామని తెలిపారు.

**కాపులకు పదవుల్లేవు**

మంగళగిరి జనసేన పార్టీలో కాపు సామాజిక వర్గం వారు పార్టీ అభివృద్ధికి వెన్నెముకగా ఉన్నారని తెలిపారు. అయినప్పటికీ కాపు సామాజిక వర్గ నేతలకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం దక్కలేదని తెలిపారు. ఇదే విషయాన్ని తామంతా త్వరలో అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లాలనుకుంటున్నట్లు చెప్పారు.

**లోకేష్ లక్ష మెజార్టీతో గెలుస్తారని ముందే చెప్పా**

నారా లోకేష్ కూటమి అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న సమయంలో 2024 జనవరిలో ఓ మీడియా ఛానల్ ఇంటర్వ్యూలో తాను మాట్లాడానని సుందరయ్య తెలిపారు. నారా లోకేష్ మంగళగిరి శాసనసభ్యునిగా లక్ష ఓట్ల మెజార్టీతో గెలుస్తారని చెప్పిన ఏకైక వ్యక్తిని తానేనని అన్నారు. విద్యాశాఖ మంత్రిగా లోకేష్ బాధ్యతలు చేపట్టి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తో కలిసి అనేక ప్రయోజనాత్మక కార్యక్రమాలు చేపడుతున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో ఆటవిడుపు కోసం కొలంబో వెళ్లి భారత్ పాకిస్తాన్ మ్యాచ్ ను వీక్షిస్తే దీనిని సైతం వైసీపీ నేతలు రాజకీయం చేసి అవాకులు, చవాకులు పేలుతున్నారని అన్నారు. టిడిపి జనసేన నేతలపై తప్పుడు ప్రచారం చేయటం వల్ల 151 సీట్లు నుంచి 11 సీట్లకు వైసీపీ పరిమితమైందని అన్నారు. అయినప్పటికీ వారి వైఖరిలో మార్పు రాలేదని తెలిపారు.

**వారి పేర్లు త్వరలో వెల్లడిస్తా**

జనసేన పార్టీ మంగళగిరిలో ఎదగకుండా ఉండేందుకు కారణమైన నాయకుల పేర్లు త్వరలో వెల్లడిస్తానని సుందరయ్య స్పష్టం చేశారు. కేవలం ఇంచార్జ్ కు తొత్తులుగా వ్యవహరించే వారికి మాత్రమే ప్రాధాన్యత ఇచ్చే పరిస్థితి ఉందని తెలిపారు. మిగిలిన వారికి కనీసం పార్టీ కార్యక్రమాల సమాచారం కూడా ఉండదని పేర్కొన్నారు. 2014 నుంచి పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న వీర మహిళలకు కనీసం పదవులు లభించకపోవడం బాధాకరమన్నారు.

## అక్షర ఆంధ్రా అభ్యర్థులు శత శాతం ఉత్తీర్ణతకు కృషి : కలెక్టర్ తమీమ్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్) :** అక్షర ఆంధ్రా అభ్యర్థులు శత శాతం ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా తెలిపారు. అక్షర ఆంధ్రా కార్యక్రమంపై విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 90,426 మంది నమోదు అయ్యారని, 9,043 మంది వాలంటీర్లు బోధిస్తున్నారని వివరించారు. పలు కేంద్రాలను స్వయంగా సందర్శించామని చెప్పారు. ఎక్కువ శాతం పరీక్ష ఉత్తీర్ణులు కాగలరని, అయితే ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణత సాధించాలనే ధ్యేయంతో చర్యలు చేపట్టామన్నారు.
విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ మాట్లాడుతూ ప్రీ ఫైనల్ పరీక్షలు ఈ నెల 28వ తేదీన, ఫైనల్ పరీక్షలు మార్చి 15వ తేదీన జరుగుతాయన్నారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, అభ్యర్థులు తమకు అవకాశం ఉన్న సమయంలో వచ్చి పరీక్షలు రాయవచ్చని తెలిపారు. పరీక్షను రెండు గంటల పాటు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్ లో వయోజన విద్యా డిప్యూటీ డైరక్టర్ ఆంజనేయులు, జిల్లా విద్యా శాఖ అధికారి డా. షేక్ సలీం భాషా, జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి కృష్ణ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి. శంకర్, సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకులు లోచర్ల రమేష్, తదితరులు పాల్గొన్నారు

## మఠాధిపతి పట్టాభిషేకం మహోత్సవానికి హాజరుకానున్న ఎమ్మెల్యే పుట్ట




బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్): కాలజ్ఞాన స్వరూపి ప్రబోధ కర్త శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి వంశీకులు 8వ తరం 12వ పీఠాధిపతులు శ్రీ శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వాముల వారి పట్టాభిషేక మహోత్సవం నేడు రంగ రంగ వైభవంగా స్వామివారి శిష్యులు భక్తులు అశేష జనవాహిని మధ్య జరగనుంది అట్టి కార్యక్రమానికి మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ హాజరవుతున్నారని టిడిపి మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధిత మండల నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొనాలని తెలిపారు.

## 27నుండి తెనాలిలో లోక కల్యాణార్థం శ్రీలలిత మహాయాగం



**తెనాలి(జర్నలిస్ట్ ):** లోక కల్యాణార్థం సర్వ గ్రహదోష నివారణార్థం త్రయాహ్నిక దీక్షగా శ్రీ లలితా మహాయాగం దక్షిణామూర్తి పీఠం ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు.
స్థానిక గంగానమ్మ పేట శ్రీ పర్వత వర్ధనీ సమేత శ్రీ రామేశ్వరాలయం వెనుక తోట ప్రాంగణంలో ఈనెల 27నుండి మార్చి 1వ, తేదీవరకు త్రయాహ్నిక దీక్షగా శ్రీ లలితా మహాయాగం, వేదపండితులు భువనగిరి సూర్యనారాయణ శాస్త్రీ, జొన్నాభట్ల ఆంజనేయ శాస్త్రీ సంయుక్త ఆధ్వర్యంలో, నిర్వహించ నున్న క్రమంలో, బుధవారం శ్రీ దక్షిణామూర్తి పీఠం ప్రాంగణంలో ప్రచార కరపత్రాలను ఆవిష్కరించిన నిర్వాహకులు కార్యక్రమాల ప్రాధాన్యతను మీడియాకు వివరించారు. జొన్నాభట్ల ఆంజనేయ శాస్త్రీ మాట్లాడుతు సర్వజన హితం కోరుతు శ్రీలలితా మహాయాగం తలపెట్టామని, ఏర్పాట్లు మొదలైనట్లు తెలిపారు. భక్తులు స్వయంగా యజ్ఞ వేదిక వద్ద ఆశీనులై, వారి అభీష్టాలు నెరవేరాలని యాగం నిర్వహించుకునే అవకాశం కల్పించామన్నారు. యాగం లో పాల్గొనే వారు, పాటించాల్సిన నియమాలు తెలిపారు. భువనగిరి సూర్యనారాయమూర్తి మాట్లాడుతు 25 హోమ కుంధములు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు ఈ విశేష యజ్ఞ క్రతువులో పాల్గొన దలచిన వారు వెంటనే వారి గోత్ర నామములు నమోదు చేసుకోవాలన్నారు. యాగం లో పాల్గొన్న భక్తులకు తమ ద్వారా అందించే ప్రసాదం వివరాలు వివరించారు. ఈ సమావేశంలొ దివ్వెల శ్రీనివాస రావు తదితర సభ్యులు పాల్గొన్నారు.

## పాల విక్రయ కేంద్రాల తనిఖీ



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పట్టణంలో బుధవారం పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు కె.వి.వి సత్యనారాయణ పలు పాల విక్రయ కేంద్రాలను తనిఖీ చేశారు. ట్రేడ్ లైసెన్స్ లేకుండా ఎవరు పాల విక్రయాలు చేయరాదని స్పష్టం చేశారు. పాల నమూనాలను సేకరించి ఆహార భద్రత అధికారులకు పరీక్షల నిమిత్తం పంపిస్తున్నట్లు తెలిపారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## గవర్నర్‌కు ఘన స్వాగతం పలికిన కలెక్టర్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాకు బుధవారం విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ కు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఘన స్వాగతం పలికారు. రాష్ట్రగవర్నర్ చినకొండ్రుపాడులో ఒక ప్రైవేట్ వైద్య కళాశాల గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొనుటకు విచ్చేశారు. వైద్య కళాశాల ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

## చిన్నారి పునర్విక వైద్యానికి రూ.6 కోట్లు సమకూర్చే బాధ్యత నాదే : లోకేశ్ హామీ

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఎస్ఎంఏ టైప్-1 అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ అండగా నిలిచేందుకు ముందుకు వచ్చారు. కర్నూలుకు చెందిన బాలిక పునర్విక ఈ వ్యాధితో బాధపడుతోంది. ఆమె చికిత్స కోసం మరో రూ.6 కోట్లు అవసరమని, ఆ మొత్తం అందేలా చూసే బాధ్యత తనదేనని 'ఎక్స్' వేదికగా హామీ ఇచ్చారు. తన కూతురు పునర్విక ఎస్ఎంఏ టైప్-1 వ్యాధితో బాధపడుతోందని, చికిత్స కోసం రూ.16 కోట్ల ఇంజెక్షన్ ఒక్కటే ఆప్షన్‌గా ఉందని, దాని కోసం తాము అన్ని రకాలుగా ప్రయత్నించి ప్రజల నుంచి, దాతల నుంచి రూ.10 కోట్ల వరకు సేకరించామని, మరో రూ.6 కోట్లు అవసరమని పేర్కొంటూ పునర్విక తండ్రి మంత్రి నారా లోకేశ్‌కు 'ఎక్స్' ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞప్తిపై నారా లోకేశ్ స్పందించారు. ఎస్ఎంఏ టైప్-1 అనేది అరుదైన వ్యాధి అని, దీనితో కండరాలు బలహీనపడతాయని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఇలాంటి స్థితిలోనూ పునర్విక పోరాడుతున్న తీరు అభినందనీయమని పేర్కొన్నారు. ఆమె నిజంగా ధైర్యవంతురాలని ప్రశంసించారు. అసాధారణ ధైర్యంతో వ్యాధితో పోరాటం చేస్తోందని అన్నారు.

ఆమె ఇంజెక్షన్ కోసం రూ.16 కోట్లు అవసరమని, దాతల నుంచి రూ.10 కోట్లు సమకూరడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. పునర్విక ఇంజెక్షన్ కోసం సహకరించిన ప్రతి ఒక్కరికీ తాను సెల్యూట్ చేస్తున్నానని అన్నారు. ఆమె చికిత్స కోసం మిగిలిన రూ.6 కోట్లు అందేలా చూసే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. సహాయం చేయాలంటూ తన కార్యాలయ 'ఎక్స్' ఖాతాకు అటాచ్ చేశారు. పునర్వికకు సహాయం చేయడానికి మరింతమంది ముందుకు రావాలని కోరారు.

## బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా రావూరు లక్ష్మీనారాయణ శాస్త్రి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడిగా రావూరు లక్ష్మీనారాయణ శాస్త్రిని నియమించారు. జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు జిల్లా కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. కొత్త బాధ్యతలతో జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

లక్ష్మీనారాయణ శాస్త్రి మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడు, జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి అంకితభావంతో పనిచేస్తానన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తిరుమలలో కొనసాగుతున్న రద్దీ.. 25 కంపార్టుమెంట్లలో భక్తులు



- వివిధ ప్రాంతాల నుంచి తరలివస్తున్న భక్తులు
- టోకెన్లు లేని భక్తులకు దర్శనానికి 12 గంటల సమయం పడుతుందన్న అధికారులు
- రూ. 300 టికెట్ ఉన్న భక్తులకు 2 నుంచి 3 గంటల సమయం పడుతుందని వెల్లడి

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** కలియుగ వైకుంఠం తిరుమల క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఏడుకొండల వాడిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుండి భక్తులు భారీగా తరలివస్తున్నారు. బుధవారం ఉదయానికి వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 25 కంపార్టుమెంట్లలో భక్తులు వేచి ఉన్నారు.

టోకెన్లు లేని భక్తులకు స్వామివారి దర్శనానికి 12 గంటల సమయం పడుతుందని టీటీడీ అధికారులు తెలిపారు. సర్వదర్శనం టోకెన్లు ఉన్నవారికి 3 నుంచి 5 గంటల సమయం పడుతుందని వెల్లడించారు. రూ. 300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు ఉన్న భక్తులకు 2 నుంచి 3 గంటల సమయం పడుతుందని తెలిపారు.

నిన్న మొత్తం 74,902 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. మొత్తం 22,869 మంది భక్తులు తలనీలాలను సమర్పించారు. హుండీ ద్వారా రూ. 4.05 కోట్ల ఆదాయం వచ్చింది.

## పరిశుభ్రతలో రాష్ట్రానికి మంగళగిరి ఆదర్శంగా నిలవాలి : మంత్రి లోకేష్

- స్వచ్ఛ మంగళగిరి 2.0కు శ్రీకారం
- స్వచ్ఛతలో మంగళగిరి మోడల్‌గా నిలవాలి : నారా లోకేష్
- ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్ర మంగళగిరి సాధ్యం



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరిని పరిశుభ్రతలో రాష్ట్రానికి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దే లక్ష్యంతో "స్వచ్ఛ మంగళగిరి 2.0" కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బుధవారం శ్రీకారం చుట్టారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, "స్వచ్ఛ మంగళగిరి" తొలి దశ ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. రెండో దశలో మరింత ప్రణాళికాబద్ధంగా, సమర్థవంతంగా కార్యక్రమాన్ని అమలు చేసి మంగళగిరి--తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిని పూర్తిస్థాయిలో పరిశుభ్రంగా మార్చడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. నగరంలో చెత్త సేకరణ, వర్గీకరణ, పారుదల వ్యవస్థలను పటిష్టం చేయాలని అధికారులకు సూచించారు. వార్డు, గ్రామ స్థాయిలో ప్రత్యేక శుభ్రత డ్రైవ్‌లు నిర్వహించడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనపై కఠిన చర్యలు తీసుకోవడం, పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టడం వంటి చర్యలు విస్తృతంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. పరిశుభ్రమైన పరిసరాలు ప్రజల ఆరోగ్యానికి ఎంతో అవసరమని, ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. "స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర" విజన్ సాధనలో మంగళగిరి ముందంజలో నిలవాలని, ప్రజల భాగస్వామ్యం లేకుండా పరిశుభ్రత సాధ్యం కాదని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ యంత్రాంగంతో పాటు ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, యువత చురుకుగా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్ అలీం బాషా, సూపరింటెండెంట్ ఇంజినీర్ లీలా కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ఎమ్ వర్సిటీలో టెక్నో కల్చరల్ ఫెస్ట్ ప్రారంభం

- నాలుగు రోజులపాటు వివిధ రకాల పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు
- 28న సినీ సంగీత గాయకుల మ్యూజికల్ షో



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీ ఎస్ఆర్ ఎం యూనివర్సిటీలో బుధవారం ఇన్ఫిటస్ - 2026 పేరిట విద్యార్థుల టెక్నో కల్చరల్ ఫెస్ట్ ప్రారంభమైంది. యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య సతీష్ కుమార్, విద్యార్థి వ్యవహారాల విభాగం డైరెక్టర్ మేజర్ జనరల్ గురుప్రీత్సింగ్ నారంగ్, రిజిస్ట్రార్ ప్రేమ్ కుమార్ లతో పాటు ముఖ్యఅతిథిగా స్విస్ రే కంపెనీ వైస్ ప్రెసిడెంట్ విజయ్ తిరుమల వర్సిటీ కల్చరల్ ఫెస్ట్ కు హాజరయ్యారు.

ఏడాదికి నాలుగు రోజులు పాటు జరిగే ఎస్ఆర్ఎం కల్చరల్ ఫెస్ట్ లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటారు. విద్యార్థుల కోసం టెక్నికల్ పోటీలు, హై ఎనర్జీ షోలు , సాంస్కృతిక ప్రదర్శనలు భారీగా ఏర్పాటు చేశారు. కల్చరల్ ఫెస్ట్ ప్రారంభ సందర్భంగా వైస్ ఛాన్స్ లర్ ఆచార్య సతీష్ కుమార్ విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల మానసిక వికాసానికి కల్చరల్ ఫెస్టు దోహద పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. విద్యార్థులంతా సోదరభావంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొనాలని ముఖ్యఅతిథి విజయ్ తిరుమల కోరారు. ఫెస్ట్ లో భాగంగా రెండు రోజులు పాటు విద్యార్థులకు హ్యాక్ దాన్ కోడింగ్ ఫోటోగ్రఫీ ఫ్యాషన్ షో పోటీలు నిర్వహిస్తున్నామని స్టూడెంట్ అఫైర్స్ అసోసియేట్ డైరెక్టర్ రేవతి బాలకృష్ణ పేర్కొన్నారు. ఈనెల 28న సాయంత్రం జరిగే సినీ సంగీత గాయకుల మ్యూజికల్ షోలో ప్రఖ్యాత నేపథ్య గాయకుడు కార్తీక్, డీజే గౌతమ్, జ్యోతి గాంధీ తదితరులు పాల్గొంటున్నారని వివరించారు.

## ఒక్క ఫోన్ కాల్‌తో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

- గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లో గంజాయి బ్యాచ్ ను పరిగెత్తించిన ఎమ్మెల్యే



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు నగరంలోని బృందావన్ గార్డెన్స్ ప్రాంతంలో ఓ నిర్మానుష్య ప్రదేశంలో కొంతమంది యువకులు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతూ స్థానిక ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అక్కడ నివసించే ఓ మహిళ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి గారికి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే ఎమ్మెల్యే గళ్ళా మాధవి ద్విచక్ర వాహనంపై స్వయంగా అక్కడికి చేరుకున్నారు. ఎమ్మెల్యే రాకను గమనించిన యువకులు అక్కడి నుంచి పరారయ్యారు. అనంతరం స్థానిక ప్రజలు, ఫిర్యాదు చేసిన మహిళతో ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఈ ప్రాంతంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ఆ ప్రాంతంలో క్రమం తప్పకుండా గస్తీ నిర్వహించాలని పోలీసులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆదేశాలు జారీ చేశారు. ఒక్క ఫోన్ కాల్‌కే ఇంత వేగంగా స్పందించి, స్వయంగా ఘటనాస్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం పట్ల స్థానిక ప్రజలు ఎమ్మెల్యే గళ్ళా మాధవి కృతజ్ఞతలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. ప్రజల భద్రతకు కట్టుబడి ఉన్న ప్రజాప్రతినిధిగా గళ్ళా మాధవి వ్యవహరించడం ప్రశంసనీయం అని స్థానిక ప్రజలు పేర్కొన్నారు.

## ఫిబ్రవరి 28 నుంచి జీ తెలుగులో, జీ5లో మన శంకర వరప్రసాద్




**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్) :** మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో నటించిన సంక్రాంతి బ్లాక్‌బస్టర్ మన శంకర వరప్రసాద్ గారు మళ్లీ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేయనుంది. హిట్ మేకర్ అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ హై-ఆక్షన్ కామెడీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ థియేట్రికల్ రన్‌లో భారీ వసూళ్లు సాధించి, విస్తృత ప్రశంసలు అందుకుంది. మన శంకర వరప్రసాద్ గారు గ్రాండ్ వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా ఫిబ్రవరి 28, శనివారం సాయంత్రం 5:30 గంటలకు, మీ జీ తెలుగులో.. తప్పక చూడండి!

ఈ ఏడాది సంక్రాంతి బ్లాక్బస్టర్గా నిలిచిన మన శంకర వరప్రసాద్ గారు ఫిబ్రవరి 11 నుంచి డిజిటల్ ప్లాట్‌ఫాం జీ5(జుజు5) వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై సాహు గరపాటి, సుష్మితా కొణిదెల సంయుక్తంగా ఈ సినిమాని నిర్మించారు. మెగాస్టార్ చిరంజీవి శంకర వరప్రసాద్ పాత్రలో కనిపించగా, నయనతార, వెంకటేష్ దగ్గుబాటి, కెథరిన్ ట్రెసా, సచిన్ ఖేడేకర్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు.

భీమ్స్ సెసిరోలియో సంగీతం, సమీర్ రెడ్డి ఛాయాగ్రహణం, తమ్మిరాజు ఎడిటింగ్‌తో ఈ సినిమా మరింత ఆకర్షణీయంగా మారింది. హృదయస్పర్శక కుటుంబ భావాలు, నవ్వులు పూయించే కామెడీ, థ్రిల్లింగ్ యాక్షన్ సీక్వెన్స్‌లు, ఆత్మీయ ప్రదర్శనలతో అన్ని వయసుల ప్రేక్షకులకు పూర్తి ఎంటర్‌టైన్‌మెంట్ ప్యాకేజీగా నిలిచింది. డిజిటల్ వేదికపై కూడా సెన్సేషన్ సృష్టించిన ఈ చిత్రం జీ5లో సంచలనాత్మకంగా 500 మిలియన్ స్ట్రీమింగ్ నిమిషాలను సాధించి ప్రేక్షకాదరణను మరింతగా చాటుకుంది.

మెగా ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ మన శంకర వరప్రసాద్ గారు సినిమాని జీ5, జీ తెలుగు వేదికగా మీరూ తప్పకుండా చూసేయండి.

## మఠాధిపతులు శ్రీశ్రీవీరధర్మజ వేంకటాద్రి స్వాములకి నేడు పట్టాభిషేక మహోత్సవం



- మఠాధిపతి తమ్ముడు దత్తాత్రేయ స్వామి పిలుపు

**బ్రహ్మంగారిమఠం( జర్నలిస్ట్ ఫైల్):** బ్రహ్మంగారిమఠం లో 24,25, 26 తేదీలలో మఠం ప్రాంగణంలో జరుగు నూతన మఠాధిపతి పట్టాభిషేకానికి అందరూ ఆహ్వానితులేనని మఠాధిపతి తమ్ముడు శ్రీ దత్తాత్రేయ స్వామి భక్తులకు పిలుపునిచ్చారు. రేపు అనగా గురువారం 26వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 1.30 గం.మధ్యలో స్వర్ణ కిరీట ధారణతో మఠాధిపతి సింహాసనం అధిష్టించే ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్ణయించిన ముగ్గురు ఆధ్యాత్మికవేత్తలతో కిరీట ధారణ ఉంటుందని ఆయన తెలియజేశారు. గణపతి మండపం ముందు ఏర్పాటు చేయనున్న వేదికపై సింహాసన సమయంలో తదుపరి పల్లకిలో మహాద్వారం దగ్గరకు విచ్చేసి భక్తులకు శిష్యులకు జనులకు మఠాధిపతి దర్శనం ఉంటుందని ఆయన తెలియజేశారు. ఈ సమయంలో మఠాధిపతితో కరచాలనం కానీ ఫోటోలు కానీ మఠాధిపతి ప్రతి నమస్కారం కానీ ఉండవని తెలిపారు. ఈ కార్యక్రమం పూర్తి ఆధ్యాత్మిక పద్ధతిలో అనగా వైదిక ఆగమ శాస్త్ర పద్ధతిలో జరుగుతుందన్నారు.

## మేధో సంపత్తి హక్కులపై జాతీయ స్థాయి ఆన్‌లైన్ శిక్షణ శిబిరం

**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్):** మంగళగిరిలోని నిరంల ఫార్మసీ కాలేజిలో మేధో సంపత్తి హక్కులు, పేటెంట్లు మరియు నమూనాల దాఖలుపై జాతీయ స్థాయి ఆన్‌లైన్ శిక్షణ శిబిరాన్ని ఈ నెల 27న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నారు.

ఈ శిక్షణ శిబిరాన్ని కళాశాల ఔషధ విశ్లేషణ విభాగం మరియు మేధో సంపత్తి హక్కుల విభాగం ఆధ్వర్యంలో, భారత ప్రభుత్వానికి చెందిన రాజీవ్ గాంధీ జాతీయ మేధో సంపత్తి నిర్వహణ సంస్థ సహకారంతో నిర్వహిస్తున్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా నాగ్‌పూర్‌కు చెందిన పేటెంట్లు, నమూనాల సహాయ నియంత్రణాధికారి డా. భారత్ ఎన్. సూర్యవంశి పాల్గొననున్నారు. మేధో సంపత్తి హక్కుల ప్రాముఖ్యత, పేటెంట్ దాఖలు విధానం, నమూనాల నమోదు ప్రక్రియ, ఆవిష్కరణల రక్షణ, దేశంలో అమలులో ఉన్న చట్టపరమైన అంశాలపై ఆయన వివరించనున్నారు.

## దళితవాడల్లో కళ్యాణ మండపాలు నిర్మిస్తే ఉపయోగకరం : ప్రభుత్వ చీఫ్ విప్ జీ



- టిట్కో ఇళ్ల వద్ద దేవాలయాల నిర్మాణ ప్రతిపాదన సంతోషకరం
- అసెంబ్లీలో ప్రస్తావించిన చీఫ్ విప్ జీవి ఆంజనేయులు

**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్ ):** రాష్ట్రవ్యాప్తంగా నిర్మించిన టిట్కో ఇళ్ల వద్ద దేవాలయాలు నిర్మించాలని కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సంతోషకరమని ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు అన్నారు. బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో జీరో అవర్స్ లో చీఫ్ విప్ జీవి మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా దళితవాడల్లో, టిట్కో ఇళ్ల వద్ద దేవాలయాలను నిర్మించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం శుభపరిణామం అన్నారు. అలాగే దళితవాడల్లో దేవాలయాల నిర్మాణాలతో పాటు మినీ కళ్యాణ మండపాలు నిర్మిస్తే ఎంతగానో ఉపయోగపడతాయని చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. శుభకార్యాలు జరుపుకునే సమయంలో వర్షాలు కురిస్తే ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, దేవాలయాలతో పాటు మినీ కళ్యాణ మండపాలు నిర్మించినట్లయితే వారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, అంశాన్ని సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి మినీ కళ్యాణ మండపాలు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని చీఫ్ విప్ జీవి ఆంజనేయులు అభిప్రాయం వ్యక్తం చేస్తూ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

## దళిత యువకుల హత్యకు రాజకీయ జోక్యం వద్దు

- దళిత కుటుంబాలకు న్యాయం చేయాలి
- నిందితులను కఠినంగా శిక్షించేంతవరకు ఉద్యమం తప్పదు
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ



**బ్రహ్మంగారిమఠం( జర్నలిస్ట్ ఫైల్):** బ్రహ్మంగారి మఠం మండలంలో ఈనెల 5,6వ తేదీన ఇద్దరూ దళిత యువకులు మరణం వెనక ఉన్న కారణాలు వెలికి తీయడంలో పోలీసులు అలసత్వం వహిస్తూ దాని వెనుకున్న రాజకీయ జోక్యంలో పోలీసులు ఉన్నారని దళిత కుటుంబాలకు అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకోమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ హెచ్చరించారు ముందుగా కక్కయ్య మఠం నుండి ఐదు రోడ్ల కూడలి వరకు భారీగా వేలాది మందితో ర్యాలీ చేపట్టారు అనంతరం స్థానిక మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి పార్కు సమీపంలో బహిరంగంగా సమావేశాన్ని ఏర్పాటు చేశారు ఈ సమావేశానికి జాతీయ రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో గత పది రోజు మైదుకూరు నియోజకవర్గంలో అన్ని మండలాలలో అన్ని దళిత గ్రామాలలో పర్యటించి జరిగిన హత్య వెనకాల ఉన్న రహస్యాలను రాజకీయ పోలీసుల చేతుల్లో నలిగిపోతున్నాయని ఇద్దరు దళిత యువకులు హత్య చేసి తెలుగు గంగ కాలవలో శవాలగా మారడంతో వారి కుటుంబాలకు ఏ రాజకీయ నాయకులు భరోసా ఇవ్వకపోవడం దీని వెనక ఉన్న నిజాలు నెగ్గు తేల్చకపోవడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు ఇప్పటికే బ్రహ్మంగారిమఠం మండలానికి రెండుసార్లు పర్యటించి జిల్లా కలెక్టర్ ఎస్పీ దృష్టికి తీసుకెళ్లామని వారికి న్యాయం చేస్తామని హామీ ఇస్తున్నారే కానీ ఇంతవరకు హామీలను నెరవేర్చకపోవడం బాధాకరంగా ఉందని ప్రతి ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు నాయకులు కుల సంఘాలు నాయకులు శ్రమను ఓమ్ము చేయమని దళిత కుటుంబాలకు న్యాయం జరిగేంత వరకు పోరాటం తప్పదు ఆయన హెచ్చరించారు హత్యల ఎనక ఎంతటి వారి ఉన్న వదిలిపెట్టే ప్రస్థానమే లేదని యువకుడు ఓబులేసు సతీష్ మరణాల వెనుక దాగివున్న రహస్యాలను పూర్తిస్థాయిలో మీడియా ముందుకు తేవాలని ఈ ప్రాంత గా ఎన్నుకున్న శాసనసభ్యులు మాజీ శాసనసభ్యులు ఎంతవరకు దళితలకు జరిగిన అన్యాయాన్ని గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు నాయకులు హత్యకు గురైన యువకుల కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు పాపాన పోలేదు అని ఇదేనా కడప జిల్లాలో మాదిగలకు ఇచ్చిన గౌరవం అని ఆయన సూటిగా ప్రశ్నించారు ఇప్పటికైనా మాదిగ సోదరుల దళితుల పట్ల జరుగుతున్న దాడులు దౌర్జన్యాలు హత్యలు గుర్తించుకొని రాజకీయ నాయకులకు జేజేలు కొట్టవద్దని దయవుంచి గుర్తుంచుకొని మనకోసం పనిచేసే వాళ్లను గుర్తించుకోవాలని ఆయన సూచించారు జిల్లా ఎస్పీ షేల్కేనచికేత్ విశ్వనాథ్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిన హత్యల రహస్యాలను యంగ్ ఐపీఎస్ అధికారి నియమించి ఈ మండలంలో జరిగిన హత్యలు పక్క మండలం కాశినాయన మండలాల్లో జరిగిన హత్య పెట్రోల్ దాడిలో పైన కూడా విచారణ చేయాలని ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకుల ద్వారా విజ్ఞప్తి చేస్తున్నామని ఆయన తెలియజేశారు ఓబులేష్ సతీష్ వి ముమ్మాటికి పరువు హత్యగానే భావిస్తున్నాం అని దానికి ప్రధానంగా ప్రేమ వ్యవహారమే కారణం అని ఈ జంట హత్యల కేసును వదిలి పెట్టేదే లేదని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు మున్నంగి నాగరాజు సొట్టా నరేంద్ర బాబు రాష్ట్ర నాయకులు రవీంద్ర సురేష్ ఎంఎస్పి రాష్ట్ర అధ్యక్షులు విశ్వనాథ్ మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్ ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షులు బాబు, విహెచ్ పిహెచ్ రాష్ట్ర అధ్యక్షులు చిన్న సుబ్బయ్య యాదవ్ ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి మాతయ్య ఎమ్మెస్పి జిల్లా అధ్యక్షులు రాజు వివిధ ప్రాంతాల జిల్లాల ఎమ్మార్పీఎస్ ఎమ్మెస్ పి,ఎంఈఎఫ్, నాయకులు ఎంఆర్పిఎస్ మండల అధ్యక్షులు ఎర్రంపల్లె జ్ఞానేశ్వర్ రావు ఎం ఈ ఎఫ్, అధ్యక్షులు గురవయ్య, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు చెన్నయ్య మాదిగ నారాయణ మాదిగ చలపతి సుభాష్ నియోజకవర్గ నాయకులు, సంజీవ మాదిగ జయ చంద్ర,మృతుల కుటుంబాలకు సభ్యులు వారి రక్త బంధువుల,తదితరులు పాల్గొన్నారు

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467